


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :57 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజీలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 04 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి..

### గవర్నర్‌కు సీఎం లేఖ

- మంత్రి కొండా సురేఖ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు
- క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్
- రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు




హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై

## ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది

### గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..

- ★పాయకరావుపేటలో పండగ వాతావరణం
- ★దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- ★పాయకరావుపేట వద్ద నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు
- ★4 జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- ★ఇక ఉత్తరాంధ్రకే వలసలు వస్తాయన్న ముఖ్యమంత్రి
- ★గోదావరి జలాలు తీసుకొచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు





అమరావతి: "ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో మిగతా 2 లో



## విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

హైదరాబాద్: తెలంగాణలో ఆదిలాబాద్, మామూనూరు (వరంగల్) విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు.



### 'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'..

## ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- ఇరాన్‌పై అమెరికా నిఘా పూర్తిస్థాయిలో ఉందన్న ట్రంప్
- అవసరమైతే మరోసారి దాడి చేస్తామని హెచ్చరిక
- హర్మూజ్‌పై తమకు బలమైన పట్టు ఉందని వెల్లడి
- ఇరాన్ తాజా దాడుల్లో 18 మంది మృతి
- అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు

## స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి

### రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలి

- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం
- జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది
- కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది
- నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవు



అమరావతి: జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. మిగతా 2 లో



## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు రండి

- హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు ఈ సదస్సు
- సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని వినతి
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కోసం మరో 750 ఎకరాల భూసేకరణకు సిద్ధమని వెల్లడి

## కేబినెట్ నుంచి తొలగింపు.. కొండా సురేఖ ఏమన్నారంటే?

### జగ్గారెడ్డి, రాజగోపాల్ రెడ్డిపై చర్యలేవని సూటి ప్రశ్న

- కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని ఖండించిన కొండా సురేఖ
- వివరణ అడగకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆవేదన
- కూతురి వ్యాఖ్యలకు నేను బాధ్యురాలిని కాదంటూ స్పష్టీకరణ




హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను కేబినెట్ నుంచి తొలగించాలని గవర్నర్‌కు సిఫార్సు చేసిన నేపథ్యంలో, ఈ నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఎటువంటి ముందస్తు సమాచారం మిగతా 2 లో

## యూపీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో కీలక పరిణామం..



### మేనల్లుడు ఆకాశ్‌పై మాయావతి సంచలన నిర్ణయం

పెద్ద బాధ్యతలకు ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలేదన్న మాయావతి

- కీలక పదవులకు దూరం చేసే సంకేతాలు
- పార్టీలో కొనసాగుతారని స్పష్టీకరణ
- 'ఎక్స్' ప్రొఫైల్ మార్చిన ఆకాశ్ ఆనంద్
- బీఎస్పీ జాతీయ కన్వీనర్ పదవిపై ఉత్కంఠ



## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్

### స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి

- వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలి
- అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది
- విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి
- కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయి

## తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది..?

### కొండా సురేఖ, చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ అధిష్ఠానం వేటు

- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నేతలకు సీఎం రేవంత్ బలమైన సంకేతం
- కొండా సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?
- ఆమె కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశముందా?"
- మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సు



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ హై కమాండ్ వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా చిన్నారెడ్డిని తొలగించింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. దీంతో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నేతలకు సీఎం రేవంత్ బలమైన సంకేతం పంపినట్లయింది. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న మిగతా 2 లో

### వైఎస్సార్ హయాంలోనే 79 శాతం

## కాలువ పనులు పూర్తయ్యాయి



- క్రెడిట్ కొట్టేసేందుకే స్టంట్లు.. కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు
- సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించిన జగన్
- పాత ప్రాజెక్టులకు క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపణ

అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా,

## 'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'..
# ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. "వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది" అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు. హర్మూజ్ జలసంధిపై తమకు బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హర్మూజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు టెహ్రాన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

## యూపీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో కీలక పరిణామం..

ఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను ఆయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఆకాశ్ ఆనంద్ పార్టీలో పనిచేయడానికి నేను అనుమతించాను. అయితే ఈ విషయంలో ఆయన మరింత పరిణతి సాధించాలి. అప్పటివరకు ఆయనకు ముఖ్యమైన పార్టీ బాధ్యతలు అప్పగించడం సముచితం కాదు" అని మాయావతి పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడంతో పాటు ప్రజలకు మరింత చేరువ కావడంపై దృష్టి పెట్టాలని ఆమె పార్టీ నేతలకు సూచించారు. ప్రత్యర్థులు లంచాలు, బెదిరింపులు, వివక్ష వంటి మార్గాలతో బీఎస్పీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మాయావతి వ్యాఖ్యల తర్వాత ఆకాశ్ ఆనంద్ తన 'ఎక్స్' ప్రొఫైల్‌ను కూడా మార్చారు. గతంలో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇప్పుడు తన ప్రొఫైల్‌లో 'బీఎస్పీ కార్యకర్త'గా పేర్కొన్నారు. దీంతో ఆయన మద్దతుదారుల్లో నిరాశ వ్యక్తమైంది. ఆకాశ్ ఆనంద్‌ను 2025 ఆగస్టులో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా నియమించారు. దీంతో ఆయన మాయావతి తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదుగుతున్నారనే అంచనాలు ఏర్పడ్డాయి. యువతను బీఎస్పీ వైపు తీసుకురావడంతో పాటు యూపీలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారని అప్పట్లో మాయావతి ప్రకటించారు. తాజా పరిణామాలతో ఆ అంచనాలపై అనిశ్చితి నెలకొంది.

## కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ
## గవర్నర్ కు రేవంత్ రెడ్డి లేఖ.. చిన్నారెడ్డిపై వేటు

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ సర్కార్, పార్టీలో నెలకొన్న తీవ్ర వివాదాలకు అధిష్ఠానం తెరదించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించేందుకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఆమెను బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సురేఖ స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు నిరాకరించిన నేపథ్యంలో, ఆమెను కేబినెట్ నుంచి తొలగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు అధికారికంగా సిఫారసు లేఖను పంపించారు. కొండా సురేఖ కుమార్తె సీఎంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆ తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సిఫారసులకు, చివరికి బర్తరఫ్‌కు దారితీశాయి. మరోవైపు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన సీనియర్ నేత చిన్నారెడ్డిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమించింది. వీటితో పాటు ఇతర కీలక పదవుల్లోనూ ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిలను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు రండి

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారిద్దరూ చర్చించారు.

ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సుతోపాటు ఎయిర్ షో, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్, భూఉపరితల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన లైవ్ డెమోలు డిఫెన్స్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌కు వివరించారు. ఈ దృష్ట్యా డిఫెన్స్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని, ఆహూతులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎయిర్ షో నిర్వహణకు గగనతల అనుమతుల మంజూరు చేయాలని.. యుద్ధ విమానాల భాగస్వామ్యంతోపాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా మద్దతు అందించాలన్నారు. త్రివిధ దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థల డెమోలను ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ గురించి రాజ్‌నాథ్ సింగ్, రేవంత్‌రెడ్డి మధ్య చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని రేవంత్ చెప్పారు. ఈ విమానాశ్రయం కోసం రక్షణ శాఖ మొత్తం 1,500 కోరిందని.. ఆ మేరకు మరో 750 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయించనున్నట్లు రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి..
# గవర్నర్‌కు సీఎం లేఖ



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ , ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ట్ర =వ,ఎ,ఎ,ఎ) గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం కోరారు. రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం లేఖపై గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి

మరోవైపు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డి స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా జి.సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏం జరిగిందంటే..

ఇటీవల పరకాల నియోజకవర్గం గీసుకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. వివరణ ఇవ్వాలని ఆయనకూ డీఏసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను హైకమాండ్‌కు పీసీసీ పంపింది. కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి వ్యవహారంపై గత రెండు రోజులుగా కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్, ముఖ్యనేతలు చర్చలు జరిపారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో స్థానం పొందిన సురేఖ వ్యవహారం గతంలో కూడా వివాదాస్పదమైనా, ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి చర్యకు గట్టిగా పట్టుబట్టారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా చర్య తీసుకోవాలనడం, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం అదే సిఫార్సు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం కూడా వారిద్దరిపై వేటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది

ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్టు వివరించారు.

"2019లో వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసింది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాప విముక్తి కలిగించారు" అని చంద్రబాబు విమర్శించారు. ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం ఉన్నాయని కొనియాడారు.

"గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

### దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో పులకించిపోయిన ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు.. తమ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు.

## తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది..?

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎంను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, దీనిపై వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు, ప్రభుత్వంపై కొందరు ఎమ్మెల్యేలు, నేతలు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, జిల్లాల్లో బయటపడుతున్న విభేదాల నేపథ్యంలో రాష్ట్ర నేతలను ఢిల్లీకి పిలిపించిన అధిష్టానం వారితో చర్చించిన సంగతి తెలిసిందే. తన పైన కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. కొండా సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవటం, అనంతరం ఆమె స్వయంగా చేసిన వ్యాఖ్యలతో ఆగ్రహంతో ఉన్న రేవంత్.. సురేఖ చేసిన ఆరోపణలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖర్గేకు వివరించారు. కొండా సురేఖ వ్యవహారాన్ని ఉపేక్షిస్తే పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లడంతో పాటు రాష్ట్ర నాయకత్వంపై లేనిపోని అపోహలకు తావిచ్చినట్లు అవుతుందని సీఎం చెప్పినట్లుగా తెలిసింది. ఇంత జరిగాక కూడా ఆమెపై చర్యలు తీసుకోకుండా ఉపేక్షించడం తగదని అన్నట్లు సమాచారం. రేవంత్ పట్టుతో కొండా సురేఖ, చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ అధిష్టానం వేటు వేసింది. మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సు చేశారు. ఇదిలా ఉండగా.. కొండా ఫ్యామిలీ ఏ పార్టీలో చేరబోతుంది?. తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది?. కొండా రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతుంది?. కొండా సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?. ఆమె కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశముందా?" అనే చర్చ నడుస్తోంది.

## వైఎస్సార్ హయాంలోనే 79 శాతం కాలువ పనులు పూర్తయ్యాయి

మొదటి పేజి తరువాయి

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

## కేబినెట్ నుంచి తొలగింపు.. కొండా సురేఖ ఏమన్నారంటే?

మొదటి పేజి తరువాయి

ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం తన వివరణ కూడా కోరకుండా ఏకపక్షంగా ఇటువంటి చర్యలు తీసుకోవడం భావ్యం కాదని ఆమె ఆక్షేపించారు. ఇటీవల తన కుమార్తె చేసిన వ్యాఖ్యల వల్ల తలెత్తిన వివాదంపై ఆమె స్పందిస్తూ, "నా కుమార్తె స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మహిళ. ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు నేను బాధ్యురాలిని ఎలా అవుతాను? ఆమె వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం నాకు లేదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను విమర్శించే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి తాను సమర్పించిన లేఖను త్వరలోనే మీడియాకు విడుదల చేస్తానని ఆమె వెల్లడించారు. ఇదే క్రమంలో పార్టీలోని ద్వంద్వ వైఖరిని ఆమె నిలదీశారు. గతంలో జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకుందని ఆమె ప్రశ్నించారు. కొండా సురేఖ ఉదంతంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు లేఖ రాశారు. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను బర్తరఫ్ చేయడానికే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపింది.

## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్
### స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి



అమరావతి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలని మంత్రులకు సూచించారు. కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరగా పరిష్కరించి.. అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మొదట పురపాలక ఆతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయి.. రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే దురుద్దేశంతో ప్రతిపక్షం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాట వినని అధికారులు, శాఖకు లేదా మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించే అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుందామని తెలిపారు. ఇటీవల కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో.. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని, ఇలాంటి అంశాలపై కూడా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. (సెప్టెంబరు 9న) అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని లోకేశ్ సూచించారు. నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరును ప్రజలకు గుర్తు చేసేలా కార్యక్రమం ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని లోకేశ్ సూచించారు.

## విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజి తరువాయి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో ముఖ్యమంత్రి గారు సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే ఫైనలైజ్ చేయడానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి గారికి విజ్ఞప్తి చేశారు. మామునూరు (వరంగల్) విమానాశ్రయం టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణలో చాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని రామ్మోహన్ నాయుడు కి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. హుస్సేన్ సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి గారికి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, సురేశ్ షెట్కార్ గారు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల రావు గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి



అమరావతి: జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జఠిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.

స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు



హైదరాబాద్: తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశం నిర్వహించారు. "నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించను

నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారే. గతంలో రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు నేనేమీ బాధపడట్లేదు. నేను తప్పుచేయలేదు.. బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం.. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ.. మీరు సంతోషంగా ఉన్నారా?గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిది. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలి. పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉంది. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పను.. పార్టీ తీరు మారాల్సిన అవసరముంది. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. నావైపు ఒక వేలు చూపితే.. రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు" అని కొండా సురేఖ అన్నారు.

శ్రీ వార్త సంపాదకీయం

# ఈ-20... మనకేంటి?

## పెట్రోల్‌లో ఇథనాల్ కలపటం వల్ల లాభనష్టాలివీ...

థనాల్!!. దీనిచుట్టూ ముఖ్యమైన ఆర్థికాంశాలున్నాయి. దాన్ని మించిన రాజకీయాలున్నాయి. వీటన్నిటినీ మించిన ప్రచార హోరు ఉంది. సరే! మరి వాస్తవాలేంటి? ఈ--20, ఈ--30 నుంచి మనమిప్పుడు ఈ--85కు వచ్చేశామని కేంద్రం ఘనంగా ప్రకటిస్తోంది. అంటే... 85 శాతం ఇథనాల్, మిగిలిన 15 శాతం పెట్రోల్ కలిపి వాహనాల్లో ఇంధనంగా వాడతారన్న మాట. మరి ఇలా వాడటం వల్ల ఎవరికెంత లాభం? ఎవరికెంత నష్టం? మన వాహనాలు వీటన్నిటికీ రెడీయేనా? ఇదంతా కేవలం ప్రభుత్వ దిగుమతి బిల్లు తగ్గించుకోవటానికేనా? పర్యావరణ హితమని చెబుతున్నదాంట్లో నిజమెంత? ఇవన్నీ వివరించేదే ఈ ప్రత్యేక కథనం..

రూపాయి పతనాన్ని అడ్డుకోవాలన్నా... డాలర్ కాస్త దిగిరావాలన్నా మొదట మనం చమురు, బంగారం దిగుమతులు తగ్గించుకోవాలి. పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపేసి విక్రయించటం మొదలుపెట్టింది కూడా అందుకే. నిజానికి ఇథనాల్ బ్లెండింగ్ 2001లో మొదలైంది. ప్రయోగాత్మకంగా కొన్ని రాష్ట్రాల్లో మొదలై... రకరకాల దశలు దాటుతూ చివరకు 2014 నాటికి బ్లెండింగ్ 2 శాతానికి చేరింది. అప్పట్లో ఇథనాల్ ఉత్పత్తి భారీగా లేకపోవటమూ దీనిక్కారణమే. కానీ తరవాత కేంద్రం వేగంగా కదిలి.. ఉత్పత్తిని పెంచే చర్యలు తీసుకోవటంతో ఇపుడు పెట్రోల్‌లో ఇథనాల్ 20 శాతానికి చేరిపోయింది. ఇపుడు దేశంలో ఏకంగా రోజుకు 20 బిలియన్ లీటర్ల ఇథనాల్ ఉత్పత్తవుతోంది. దీనిలో 12 బిలియన్ లీటర్లను మాత్రమే ఈ--20 రూపంలో కలపగలుగుతున్నారు. మిగిలిన ఇథనాల్‌ను కూడా వాడకంలోకి తెచ్చేందుకే ఇపుడు ఏకంగా ఈ--85 అంటూ ఫ్లెక్స్ ఇంధనాన్ని అమల్లోకి తెచ్చారు. దీనికోసం పలు కంపెనీలు ఫ్లెక్స్ వాహనాలను కూడా తయారు చేయటం మొదలెట్టాయి.

జనం ఆందోళనేంటి? అందులో నిజమెంత?

ఈ--85 ఫ్లెక్స్ ఇంధనాన్ని దానికోసం ప్రత్యేకంగా రూపొందించిన ఫ్లెక్స్ వాహనాల్లో వాడతారు కనక ఇబ్బందులుండవు. కానీ ఈ--20 అనేది చాలా వేగంగా సాధించిన బ్లెండింగ్. ఈ బ్లెండింగ్ పెరిగినంత వేగంగా దాన్ని తట్టుకునే వాహనాలను కంపెనీలు తయారు చేయలేదు. 2023 ఏప్రిల్ నుంచీ ఈ--20 మిశ్రమాన్ని తట్టుకునే వాహనాలనే తయారు చేయాలని కేంద్రం నిబంధనలు తెచ్చింది. 2025 నుంచి ఈ--20ని మరింత సమర్థంగా మార్చే వాహనాల్ని తయారు చేయాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. ఇదంతా బాగానే ఉంది. కానీ 2023కు ముందు రోడ్లపైకి వచ్చిన వాహనాల సంగతేంటి? అవి ఈ--20ని తట్టుకోగలవా? వాహనాలు పాడైపోవా? జవాబుదారీ ఎవరిది? ఇదే జనం ఆందోళన. వాటిలో నిజానిజాలేంటో ఒకసారి చూద్దాం...

ఈ--10 వరకూ ఫర్వాలేదు... ఈ--10 వరకూ ఏ వాహనమైనా ఓకే. ప్రపంచవ్యాప్తంగా వాహనాలన్నీ ఈ--10తో పెద్ద సమస్యలు లేకుండానే నడుస్తున్నాయి. వాహనాల జీవితకాలం పెద్దగా తగ్గటమంటూ ఉండదు.

ఈ--20.. ఆధునిక వాహనాలైతే ఓకే...

వీటికోసం ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాలైతే (2023 ఏప్రిల్ తర్వాత వచ్చినవి) ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఎందుకంటే వాహనాల ఫ్యూయల్ పంప్‌లను, ఇంజెక్టర్లను, ఫ్యూయల్ లైన్స్‌ను, ఇంజిన్ కాలిబరేషన్‌ను కంపెనీలు మార్చాయి. కానీ ఇలా మార్చని వాహనాల్లో ఈ--20 వాడితే కొంత ఇబ్బందేనన్నది నిపుణుల మాట. ట్యాంకు, పంపు, పైపులు, ఇంజెక్టర్లు, రబ్బర్ సీల్స్‌తో కూడిన ఇంజిన్ సిస్టమ్ దీర్ఘకాలంలో అరిగి దెబ్బతినే అవకాశాలు ఎక్కువన్నది వారి వారి?నంగ్.

ఈ--85, ఈ--100... ఫ్లెక్స్ వాహనాలకే .. ఈ ఇంధనాన్ని వాడాలంటే ఫ్లెక్స్ ఫ్యూయల్ టెక్నాలజీ ఉన్న వాహనాలు కావాలి. సాధారణ వాహనాల్లో ఈ ఇంధనం వాడలేం. దీనికి విభిన్నమైన ఫ్యూయల్ మ్యాపింగ్, సెన్సర్లు, భిన్నమైన భాగాలుంటాయి కనక ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఈ రకం వాహనాలను ఇప్పటికే బ్రెజిల్‌లో లక్షల కొద్దీ వాడుతున్నారు. మన దేశంలోనూ పలు కంపెనీలు ప్రత్యేక ఫ్లెక్స్ వాహనాలను తయారు చేసి ఇప్పటికే విడుదల చేశాయి.

పికప్, మైలేజీ సంగతేంటి?

ఇథనాల్‌ను పెట్రోల్‌తో పోలిస్తే ఆక్టేన్ రేటింగ్ ఎక్కువ. దీంతో ఇంజిన్ న్యాకింగ్‌ను బాగా తట్టుకుంటుంది. సామర్థ్యం ఎక్కువ. పికప్ బాగుంటుంది. కాకపోతే మైలేజీ మాత్రం పెట్రోల్‌తో పోలిస్తే తక్కువే. ఎందుకంటే పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌లో 30-- 35 శాతం ఎనర్జీ తక్కువ. దీనివల్ల ఈ--20 అయితే 3--8 శాతం... ఈ--85 అయితే 20--30 శాతం, ఈ--100 అయితే 25--35 శాతం మైలేజీ పడిపోయే అవకాశం ఎక్కువ. అంటే ఇథనాల్‌తో మైలేజీ తగ్గటమన్నది వాస్తవం. ఇక ఇంజిన్ విషయానికొస్తే కొత్త వాహనాలకైతే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. 2023కు ముందు వాహనాలైతే కొన్ని సమస్యలు ఎదుర్కోక తప్పదన్నది నిపుణుల మాట. పైపెచ్చు ఇథనాల్ గాలి నుంచి ఎక్కువ తేమను లాక్కుంటుంది. దీనివల్ల దీర్ఘకాలం వాడకుండా ఉంచితే పనిచేయటం మానేయొచ్చు. బోట్లు, జనరేటర్లలోనూ సమస్యలు ఎక్కువ వస్తుంటాయి.

లాభమెవరికి... నష్టమెవరికి?

దిగుమతుల కోసం భారీగా డాలర్లు వెచ్చిస్తున్న మన కేంద్ర ప్రభుత్వానికి ఇథనాల్ కాస్త ఊరటనే చెప్పాలి. దీనివల్ల కొంతయినా దిగుమతుల బిల్లు తగ్గుతోంది. చెరకు రైతులకూ కొంతవరకూ లాభమే. గ్రామాల్లో డిస్టిలరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు వస్తాయి. లాజిస్టిక్స్ అవసరాలు పెరుగుతాయి. కాకపోతే... భారీగా చెరకు, జొన్న, ఆహారధాన్యాలు అవసరమవుతాయి. పైపెచ్చు చెరకు పంటకు విపరీతమైన నీటి వనరులు కావాలి. భారీగా పండించాలంటే భారీగా జలవనరులూ కావాలి. ఇదే పలువురి ఆందోళనకు కారణమవుతోంది. పంటలను ఆహారానికి ఖర్చు చేయాలా? ఇంధనానికి ఖర్చు చేయాలా? అన్న చర్చ కూడా మొదలైంది. వీటన్నిటికీ కేంద్రం సరైన సమాధానం చెప్పగలిగినప్పుడే ఇథనాల్ ఎకానమీ ప్రశాంతంగా ముందుకెళుతుంది.

ఇదీ... ఫ్లెక్స్ ఎకానమీ

ఈ--85 ఇంధనాన్ని ఈ--20 కన్నా లీటరుకు రూ.20 తగ్గించి విక్రయిస్తున్నారు. దీన్నో ఆకర్షణీయ డిస్కౌంట్‌గా ప్రభుత్వం చెబుతున్నా... తగ్గుతున్న మైలేజీతో పోలిస్తే ఈ డిస్కౌంట్ వల్ల ఏమాత్రం లాభం లేదన్నది సామాన్యుల మాట. ప్రభుత్వం మాత్రం ఈ ఏడాది చివరి నాటికి ఈ--85 ఇథనాల్ స్టేషన్లను 500 ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ సంఖ్యను 5వేలకు చేర్చాలనేది లక్ష్యం. ఇక వాహన తయారీ కంపెనీలు ఇప్పటికే మార్కెట్లోకి కొత్త మోడళ్లు తెచ్చేశాయి. మారుతీ సుజుకీ వ్యాగన్--ఆర్, హీరో సంస్థ స్ప్లెండర్, హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్‌లో ఫ్లెక్స్ మోడళ్లు తెచ్చాయి. మిగిలిన కంపెనీలూ పలు మోడళ్ల తయారీలో ఉన్నాయి.

ఏంటీ ఇథనాల్? ఎలా వస్తుంది?

ఇథనాల్ అంటే... చక్కెరలు, పిండిపదార్థాలు పులియబెట్టడం ద్వారా తయారయ్యే ఆల్కహాల్. సాధారణంగా చెరకురసం, చక్కెర పరిశ్రమలో వచ్చే మొలాసిస్, జొన్న, పాడైన ఆహారధాన్యాలు, వరి, గోధుమ, వ్యవసాయ వ్యర్థాల నుంచి దీన్ని తయారు చేస్తుంటారు.

స్టాక్ మార్కెట్లో లబ్ధిదారులు ఎవరు?

భారత్‌లో ఇథనాల్ మిశ్రమ ఇంధనాల (ఈ20, ఈ85, ఈ100) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ఇథనాల్ సంబంధిత కంపెనీలు సమానంగా లాభపడవు. కొన్ని ప్రత్యక్షంగా, మరికొన్ని పరోక్షంగా ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

ఇథనాల్ ఉత్పత్తి కంపెనీలు

బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్

దేశంలోని అతిపెద్ద ఇథనాల్ ఉత్పత్తిదారుల్లో ఒకటి. భారీ స్థాయిలో డిస్టిలరీల విస్తరణ. చక్కెర, ఇథనాల్ వ్యాపారాల సమీకరణ చేస్తుంది. ఇథనాల్ డిమాండ్ పెరిగితే అత్యధికంగా లాభపడే కంపెనీల్లో ఇది ముందుంటుంది.

ప్రజ్ ఇండస్ట్రీస్

ఇథనాల్ ప్లాంట్ల రూపకల్పన, నిర్మాణంలో నైపుణ్యం. ఏ కంపెనీ కొత్త ప్లాంటు నిర్మించినా ఆర్డర్లు పొందే అవకాశం.రెండో తరం (2జీ) ఇథనాల్ టెక్నాలజీలో కూడా కీలక పాత్ర. దేశ ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 20 బిలియన్ లీటర్ల నుంచి 30 బిలియన్ లీటర్లకు పెరిగితే ప్రజ్‌కు భారీ అవకాశాలు ఉండొచ్చు.

త్రివేణి ఇంజినీరింగ్

చక్కెర. డిస్టిలరీలు, ఇథనాల్ ఈ మూడు రంగాల్లోనూ ఉనికి ఉండడం వల్ల లాభాలు పొందే అవకాశం ఉంది.

దాల్మియా భారత్ షుగర్

లిస్టెడ్ షుగర్ కంపెనీల్లో ఇథనాల్‌పై ఎక్కువ దృష్టి పెట్టిన సంస్థల్లో ఒకటి. శ్రీ రేణుక షుగర్స్

చక్కెర, ఇథనాల్ రంగాల్లో బలమైన స్థానం కలిగిన కంపెనీ. మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ కంపెనీలు నీటి కొరత కారణంగా భవిష్యత్తులో చెరకు కంటే మొక్కజొన్న (మైజ్) ఆధారిత ఇథనాల్‌కు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.

గుజరాత్ అంబుజా ఎక్స్‌పోర్ట్స్ -- మొక్కజొన్న ప్రాసెసింగ్‌లో బలమైన ఉనికి.

సుఖ్‌జిత్ స్టార్చ్ అండ్ కెమికల్స్, చమురు మార్కెటింగ్ కంపెనీలు: , ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఇవి ఈ 85, ఈ100 ఇథనాల్ ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తాయి. ఇథనాల్ నిల్వలు, రవాణా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తాయి. అయితే వీటి మొత్తం ఆదయాంలో ఇథనాల్ వాటా తక్కువే కావడం వల్ల ప్రభావం పరిమితంగానే ఉండే అవకాశముంది.

ఆటో మొబైల్ కంపెనీలు

మారుతీ సుజుకీ ..

దేశంలో తొలి ఫ్లెక్స్--ఫ్యూయల్ ప్యాసింజర్ కారును ప్రవేశపెట్టింది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుగానే సన్నద్ధమవుతోంది.

హీరో మోటోకార్ప్

భారత్ ప్రధానంగా ద్విచక్ర వాహనాల మార్కెట్ కావడంతో మంచి అవకాశాలు ఉన్నాయి.

బజాజ్ ఆటో

భవిష్యత్తులో ఫ్లెక్స్--ఫ్యూయల్ వాహనాలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ఇవన్నీ దీర్ఘకాల పెట్టుబడిదారులకు ఆసక్తికరమైన ఎంపికలే..ఇంకా ఇథనాల్ తయారీదారులతో పాటు డిస్టిలేషన్ పరికరాల తయారీ, నిల్వ ట్యాంకులు, ఇన్‌ఫ్రా, బయోఫ్యూయెల్, ధాన్యం ప్రాసెసింగ్ కంపెనీలకూ లాభమే. భారత్‌లో ఈ--20 అమల్లో ఉంది. అంటే మనకు వస్తున్న పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి విక్రయిస్తున్నారు. బెజిల్ ఎప్పటి నుంచో ఈ--85. ఈ--100ని విక్రయిస్తోంది.

# అరణ్యరోదన



మన ప్రాచీనులు అడవులను దైవంగా ఆరాధించేవారు. అడవులను జీవజాలానికి ప్రాణాధారంగా చూసేవారు. అడవులను పవిత్ర తపోభూములుగా పరిగణించేవారు. అరణ్యాల ప్రస్తావన లేని పురాణేతిహాసాలేవీ మనకు లేవు. ఉద్యాన వర్ణన లేని ప్రబంధాలేవీ మనకు లేవు. అరణ్యకాండ లేని రామాయణాన్ని, అరణ్యపర్వం లేని మహాభారతాన్ని మనం ఊహించుకోలేం. ప్రాచీన వేదర్షులు సైతం వన ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించారు. 'అంజనగంధిం సురభిం బహున్నామ కృషీవలామ్/ ప్రాహం మృగాణాం మాతరమరణ్యానిమశంసిషమ్' అని ఋగ్వేదంలోని 'అరణ్యాని సూక్తం' చెబుతోంది. అంటే, అంజనంలా సుగంధభరితమైనది, అనేక జంతువులకు తల్లివంటిది అయిన అరణ్యదేవతను స్తుతిస్తున్నాను అని అర్థం. 'దశకూప సమా వాపీ దశవాపీ సమో హ్రదః/ దశహ్రద సమః పుత్రో దశపుత్ర సమో ద్రుమః' అని 'పద్మపురాణం' చెబుతోంది. అంటే, పది బావులకు సమానం ఒక చెరువు, పది చెరువులకు సమానం ఒక సరస్సు, పది సరస్సులకు సమానం ఒక పుత్రుడు, పదిమంది పుత్రులకు సమానం ఒక వృక్షం అని అర్థం. 'అశ్వత్థమేకం పిచుమందమేకం న్యగ్రోధమేకం దశతింత్రిణీకం/ కపిత్థ బిల్వామలకత్రయాంచ పంచామ్రవాపీ నరకం న వశ్యేత్'-- రావిచెట్టు, వేపచెట్టు, మర్రిచెట్టు ఒక్కొక్కటి చొప్పున; పది చింతచెట్లు; మూడేసి వెలగచెట్లు, మారేడుచెట్లు, ఉసిరిచెట్లు; ఐదు మామిడిచెట్లు పెంచినవాడికి నరకం ఉండదు అని స్కాందపురాణం చెబుతోంది. వేద పురాణేతిహాసాలను గమనిస్తే, ప్రాచీనులు చెట్టు చేమలతో నిండిన అడవులకు ఎంతటి విలువనిచ్చేవారో అర్థమవుతుంది. ప్రాచీనకాలంలో రాజులు కూడా అడవుల సంరక్షణను బాధ్యతగా భావించేవారు. 'ద్రవ్యవనకర్మాంతాశ్చ ప్రయోజయేత్/ ద్రవ్యవనచ్ఛిదాం చ దండం కారయేత్' అని కౌటిల్యుడి అర్థశాస్త్రం చెబుతోంది. అంటే, అటవీ సంపదను సక్రమంగా వినియోగించాలి. అక్రమంగా అడవులను నరికివేసేవారిని శిక్షించాలి అని అర్థం. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో అభయవనాలు, హస్తివనాలు వంటి రకరకాల అడవుల సంరక్షణ కోసం పాటించవలసిన విధి విధానాలను వివరంగా చెప్పాడు. దాదాపు పదివేల ఏళ్ల కిందట-- నాగరికతలు మొదలైన కాలంలో భూమ్మీద దాదాపు అరవై శాతం అడవులే ఉండేవి. పద్దెనిమిదో శతాబ్దిలో పారిశ్రామిక విప్లవం మొదలయ్యేంత వరకు అడవుల పరిమాణం దాదాపు ఇదే స్థాయిలో ఉండేది. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి అడవులు క్షీణించడం మొదలైంది. ఆధునికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ అడవుల విస్తీర్ణాన్ని కబళించడం మొదలైంది. ఇప్పుడు భూమ్మీద దాదాపు ముప్పయి శాతం అడవులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి నేటి వరకు భూమ్మీద ఉన్న అడవుల విస్తీర్ణం సగానికి సగం క్షీణించి పోయింది. ప్రస్తుత శతాబ్ది మొదలైన తొలి ఇరవై ఏళ్లలోనే ఏకంగా ఆరు శాతం మేరకు అడవులు తరిగిపోయాయి. మన దేశంలోనైతే, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు సగానికి సగం అడవులు అంతరించిపోయాయి. ఒకవైపు అడవుల విస్తీర్ణం తరిగిపోతుంటే, మరోవైపు మరుభూముల విస్తీర్ణం పెరుగుతోంది. గడచిన శతాబ్ద కాలంలో సహారా ఎడారి విస్తీర్ణం పది శాతం పెరిగింది. 'ఒక అడవిని సృష్టించడం కంటే ఒక ఎడారిని సృష్టించడం తేలిక కావడమే విచారకరం' అన్నాడు ఇంగ్లిష్ శాస్త్రవేత్త, పర్యావరణవేత్త జేమ్స్ లవ్‌లాక్. పనులు తేలిక చేసుకోవడానికి అలవాటుపడ్డ ఆధునికులు అడవులను సృష్టించే శ్రమ తీసుకోకుండా, తేలికగా ఎడారులను సృష్టించుకుంటున్నారు. అడవులు పుడమికి ఊపిరితిత్తులు. ఆధునిక మానవులు వాటికి తూట్లు పొడుస్తున్నారు. పర్యవసానంగా భూతాపం పెరిగి, మనుషులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మనుషులకు ఊపిరాడాలన్నా, సకాలంలో వానలు కురిసి పంటలు పండాలన్నా, ఇంకా ఈ భూమ్మీద మానవాళి మరిన్ని కాలాలపాటు మనుగడ సాగించాలన్నా, మనం ఇప్పటికైనా మేలుకొని అడవులను కాపాడుకోవాలి. అడవులన్నీ నశించాక మానవాళి చేసే ఆక్రందనలు అరణ్యరోదనలే అవుతాయి.

# నేరేడు విరగ కాస్తే కరువు తప్పదా? వాతావరణ మార్పులను ముందే పసిగట్టగలవా?



'ఈ ఏడాది నేరేడు చెట్లు అసాధారణంగా ఎక్కువ పండ్లు కాస్తున్నాయి. ఇది రాబోయే కరువుకు ప్రకృతి హెచ్చరిక' అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వాదన వెనుక శాస్త్రం ఏమి చెప్తున్నది? పెద్దల అనుభవాలు, అమ్మమ్మల పరిశీలనలు, స్ట్రెస్ ఫ్రూటింగ్, మాస్టింగ్ వంటి శాస్త్రీయ పదాలు కూడా జోడించటంతో ఇది మరింత నమ్మదగినట్టుగా కనిపిస్తున్నది. అయితే నిజంగా నేరేడు చెట్లు విరగకాస్తే కరువు వస్తుందా? చెట్లు భవిష్యత్తులో వచ్చే వాతావరణ మార్పులను ముందే పసిగట్టగలవా? నేరేడు చెట్లు ఈ ఏడాది నిజంగానే ఎక్కువ పండ్లు కాస్తున్నాయా? తెలంగాణ లోని కొన్ని ప్రాంతాల్లో రైతులు, గ్రామీణ ప్రజలు ఈసారి నేరేడు చెట్లపై పండ్లు సాధారణం కంటే ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్తున్నారు. ఇది పూర్తిగా కల్పితం కాదు. కానీ ఒక ప్రాంతంలో లేదా కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువ పండ్లు కనిపించటం ద్వారా దేశవ్యాప్తంగా కరువు వస్తుందని చెప్పటం శాస్త్రీయంగా సరైన నిర్ధారణ కాదు. ప్రతి సంవత్సరం చెట్లలో పుష్పించటం, పండ్లు కాయటం అనేవి వర్షపాతం, ఉష్ణోగ్రతలు, నేలలో సారం, తేమ, చెట్టు ఆరోగ్యస్థితి, పరాగసంపర్కం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'మాస్టింగ్' అనే పదం నిజంగానే వృక్షశాస్త్రంలో ఉన్నది. కొన్ని వృక్షజాతులు ప్రతి సంవత్సరం సమానంగా పండ్లు ఇవ్వవు. కొన్నేండ్లు తక్కువగా, మరికొన్నేండ్లు భారీగా ఉత్పత్తి చేస్తాయి. దీనినే 'మాస్టింగ్' అంటారు. ఓక్, పైన్, పనస, అనాస వంటి అనేక అడవి చెట్లలో ఈ లక్షణం కనిపిస్తుంది. దీనివల్ల కలిగే ప్రయోజనం ఏమిటంటే...ఒకేసారి భారీ సంఖ్యలో విత్తనాలు ఉత్పత్తి చేస్తే వాటిని పక్షులు, జంతువులు మొత్తం తినలేవు. ఫలితంగా కొన్ని విత్తనాలు నేలలో పడిపోయి కొత్త మొక్కలుగా ఎదుగుతాయి. అంటే 'మాస్టింగ్' అనేది ప్రకృతిలో జాతి మనుగడ కోసం ఏర్పడిన ఒక వ్యూహం. నిరుడు తూర్పుకనుమల్లో మేం తిరుగుతున్నపుడు చెట్లకు పనస పండ్లు విపరీతంగా వేలాడుతూ కొన్ని కుప్పలుగా నేలమీద రాలిపోవటం చూశాం. అలాగే పైనాపిల్ కూడా. 'ఈ కొండ ప్రాంతాల్లో ఊట నీటి వల్ల ఈ పండ్లు బాగా పండుతాయి. ఇలా పండటం వల్ల కరువు ఎపుడూ రాలేదు' అని అక్కడి రైతులు చెప్పారు. కొన్ని మొక్కలు లేదా చెట్లు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు ఎక్కువ పూలు లేదా పండ్లు ఉత్పత్తి చేస్తుంటాయి. నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతలు, చీడలు, వేర్లకు నష్టం వంటి పరిస్థితుల్లో కొన్ని మొక్కలు తమ జీవచక్రాన్ని వేగవంతం చేసి విత్తనాలను ఉత్పత్తి చేయటానికి ప్రయత్నిస్తాయి. భారతదేశంలో అత్యంత సహనశక్తి కలిగిన చెట్లలో నేరేడు ఒకటి. లోతైన వేర్లు ఉంటాయి. ఎండలను తట్టుకుంటుంది. తక్కువ నీటితో కూడా బతుకుతుంది. భూగర్భ జలాలను లోతుగా అందుకోగలదు. అందుకే నేరేడుచెట్టు పండ్లు ఎక్కువగా కాయటం అనేది తప్పనిసరిగా కరువు సంకేతం అని చెప్పలేం. ఈ ఏడాది ఎక్కువ పండ్లు ఎందుకు కనిపిస్తున్నాయి? దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. చెట్టు గత సంవత్సరం నిల్వ చేసుకున్న శక్తిని ఈ ఏడాది పండ్ల రూపంలో వినియోగించి ఉండవచ్చు. కొన్ని చెట్లలో పుష్పోత్పత్తిని వేడి ప్రభావితం చేస్తుంది. కొన్నేండ్లకు ఒకసారి సహజంగానే భారీగా పండ్లు కాస్తుంటాయి. ఒక గ్రామంలో కనిపించిన పరిస్థితి రాష్ట్రమంతటా వర్తించకపోవచ్చు. నేరేడు చెట్లు ఎక్కువ పండ్లు కాస్తే కరువు వస్తుందనే వాదనకు ప్రత్యక్ష శాస్త్రీయ ఆధారాలు లేవు. అయితే, చెట్లు నీటి ఒత్తిడికి స్పందిస్తాయి. మాస్టింగ్, స్ట్రెస్ ఫ్రూటింగ్ వంటి ప్రక్రియలు నిజంగానే ఉన్నాయి. నేరేడు చెట్లు ఒక ముఖ్యమైన సందేశం మాత్రం ఇస్తాయి. అది ప్రకృతిలో జరుగుతున్న మార్పులను గమనించమని సూచిస్తాయి. భారత్‌లో వాతావరణ మార్పు ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండలు పెరుగుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. వర్షాలు అస్థిరంగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో నేరేడు చెట్లు ఎక్కువ పండ్లు పండాయా? లేదా? అనేది కాదు, నీటిని ఎలా వినియోగిస్తున్నాం? భూగర్భ జలాలను ఎంత వేగంగా ఖాళీ చేస్తున్నాం? చెట్లను ఎంత మేరకు కాపాడుతున్నాం? అనేదే అసలు ప్రశ్న. ప్రకృతి సంకేతాలను గౌరవించాలి. కానీ వాటిని మూఢనమ్మకాలుగా కాకుండా శాస్త్రీయ అవగాహనతో అర్థం చేసుకోవాలి. అప్పుడే సంప్రదాయ జ్ఞానం, ఆధునిక శాస్త్రం కలిసి మన భవిష్యత్తును కాపాడుతాయి.

# 'గుర్తింపు' గండం!

### డోలాయమానంలో 5 లక్షల ఇంటర్ విద్యార్థులు
### అనుబంధ గుర్తింపు లేకున్నా.. ప్రైవేటు కాలేజీల్లో జోరుగా ప్రవేశాలు
### మే నెలాఖరుతోనే ముగిసిన అఫ్లియేషన్ల గడువు
### తనిఖీల నివేదికలు ఇచ్చామంటున్న జిల్లా అధికారులు
### బోర్డు బృందాలు మళ్లీ తనిఖీ చేయాల్సిందేనంటున్న కార్యదర్శి
### ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది ఇంటర్ విద్యార్థుల భవిష్యత్ గాలిలో ఊగిసలాడుతోంది. కాలేజీల్లో చేరినా వాటికి గుర్తింపు ఉందా? లేదా? అన్న డోలాయమానంలో పడిపోయారు. అన్ని జిల్లాల్లో ఈ అయోమయం నెలకొన్నా ఇంటర్మీడియెట్ బోర్డు ఏమాత్రం చలించడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా 3,400 జూనియర్ కాలేజీలున్నాయి. ప్రైవేటు రంగంలో 1400. ప్రభుత్వ రంగంలో ఉన్న 800 కాలేజీలకు బోర్డు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ప్రైవేటు రంగంలో ఉన్న వాటిల్లో కేవలం 209కి మాత్రమే బోర్డు గుర్తింపు వచ్చింది. వెయ్యికి పైగా కాలేజీలకు అఫ్లియేషన్ ఎందుకు ఆపారో బోర్డు అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే 'చూస్తాం... ఇస్తాం... చేస్తాం...' అంటూ దాటవేస్తున్నారు. అనుబంధ గుర్తింపును ఏప్రిల్ నాటికే పూర్తి చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. ఇంటర్ షెడ్యూల్ ప్రకారం చూసినా మే నెలాఖరుకే గుర్తింపు ఇవ్వాలి. ప్రైవేటు కాలేజీలను తనిఖీలు చేసి, నివేదికలను బోర్డుకు పంపామని జిల్లా అధికారులు కూడా చెబుతున్నారు. ప్రైవేటువే కాదు కొన్ని మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సంక్షేమ గురుకులాలకు కూడా బోర్డు అనుమతినివ్వలేదు.

వాటిని ధ్రువీకరించేదెవరు?

ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కాలేజీలు అవసరమైన ధ్రువపత్రాలన్నీ సమర్పించాయి. అగ్నిమాపకశాఖ, శానిటేషన్, ట్రాఫిక్, భవన పటిష్టత వంటి పత్రాలను బోర్డుకు ఇచ్చాయి. వీటన్నింటినీ అధికారులు స్వయంగా పరిశీలించాలని ఇంటర్ కార్యదర్శి భావిస్తున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయి అధికారులు కాలేజీలతో కుమ్మక్కై వాటిని ధ్రువీకరించారనేది కార్యదర్శి అనుమానం. వాస్తవానికి బహుళ అంతస్తుల భవనాల్లో నడిచే కాలేజీలకు అగ్నిమాపక శాఖ ఎప్పట్నుంచో అనుమతి ఇవ్వొద్దని చెబుతోంది. పరీక్షలు దగ్గరపడే వరకూ అనుమతులూ ఇవ్వడం లేదు. ఆఖర్లో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అఫ్లియేషన్ ఇస్తున్నట్టు చెబుతున్నాయి.

అఫ్లియేషన్ లేకున్నా అడ్మిషన్లు

అనుబంధ గుర్తింపు లేకున్నా అన్ని కాలేజీలూ పెద్దఎత్తున విద్యార్థులను చేర్చుకున్నాయి. రూ. 80వేల నుంచి రూ. 4 లక్షల వరకూ వార్షిక ఫీజు దండుకున్నాయి. జూన్ 1 నుంచే క్లాసులు మొదలు పెట్టాయి. అయినా అధికారులు గుర్తింపులేని కాలేజీలను అడ్డుకునే సాహసం చేయడం లేదు. గుర్తింపు లేని కాలేజీల్లో ఇప్పటికే ఐదు లక్షల మంది చేరారు. గుర్తింపు ఉంటే తప్ప వీళ్లు వార్షిక పరీక్షలు రాసే అవకాశం ఉండదు. లేదంటే ప్రైవేటుగా పరీక్షలు రాయాలి. ఇంకోవైపు కార్పొరేట్ కాలేజీల మాయాజాలం యథాతథంగా సాగుతోంది. గుర్తింపు ఉన్న బ్రాంచీల్లో విద్యార్థుల ప్రవేశాలు చూపిస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ బ్రాంచీలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య నిండినా చేర్చుకుంటున్నారు. వారి ప్రవేశాలను వరంగల్, ఖమ్మం లేదా ఆదిలాబాద్ బ్రాంచీల్లో చూపిస్తున్నారు. అక్కడ ప్రవేశాలు లేకపోవడమే వారికి కలిసి వస్తోంది. పెద్ద కాలేజీలు ఇంత బాహాటంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికారులు తమకు మాత్రం అఫ్లియేషన్లు ఇవ్వకుండా వేధించడం ఏమిటని కొన్ని కాలేజీల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇంటర్ అధికారుల వివరణ కోరేందుకు యత్నించగా వారు స్పందించలేదు.

# అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!



'మిరాయ్'తో మెప్పించిన రితికా

బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్

'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్

మరిన్ని అవకాశాలతో దూసుకుపోయే ఛాన్స్



ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.



# ప్రళయ్.. ధురంధర్ తర్వాత రణ్‌వీర్ సింగ్ కొత్త ప్రాజెక్టు ఇదే..



## సెట్స్‌పైకి భారీ సర్వైవల్ థ్రిల్లర్

'ప్రళయ్' అనే కొత్త సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన రణ్‌వీర్ సింగ్

ముంబై నేపథ్యంలో భారీ స్థాయిలో పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్

'స్కామ్ 1992' ఫేమ్ జై మెహతా దర్శకత్వం, కీలక పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్

సుమారు రూ.300 కోట్ల బడ్జెట్‌తో బిర్లా, హన్సల్ మెహతా, రణ్‌వీర్ సంయుక్త నిర్మాణం

'ధురంధర్' సిరీస్ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రణ్‌వీర్ నటిస్తున్న చిత్రం

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. భారతదేశంలో ఇంత భారీ స్థాయిలో ఇలాంటి కథాంశంతో సినిమా రావడం ఇదే తొలిసారని దర్శకుడు హన్సల్ మెహతా పేర్కొన్నారు. రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్‌పై చూపిన ఆసక్తి, నిబద్ధత వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనన్య బిర్లాకు చెందిన బిర్లా స్టూడియోస్, హన్సల్ మెహతా-సాహిల్ సైగల్‌కు చెందిన ట్రూ స్టోరీ ఫిలింస్, రణ్‌వీర్ సింగ్ సొంత నిర్మాణ సంస్థ మా కసమ్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జై మెహతా, విశాల్ కపూర్ కలిసి రాసిన ఈ ఒరిజినల్ కథపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ



# పవర్ స్టార్ 'OG2' పై బిగ్ అప్‌డేట్..

ఏర్పాట్లు పూర్తి కాగానే

రెగ్యులర్ అప్‌డేట్స్!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు పండుగలాంటి వార్త బయటకు వచ్చింది. టాలీవుడ్‌లో ఎంతోమంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దే కాల్ హిమ్ 'OG' సీక్వెల్ ''OG 2'పై ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్ట్ కోసం డేట్స్ కేటాయించినట్లు వార్తలు వస్తుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ప్రాజెక్ట్‌కి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులు పూర్తయిన వెంటనే వరుస అప్‌డేట్స్ ఇచ్చేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. ూశ్రీంశీ =ఘుఎ - రామ్ చరణ్ తర్వాత బుచ్చిబాబు కథ ఎవరికి? హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? డేట్స్ ఇచ్చేసిన పవన్ కల్యాణ్: దర్శకుడు సుజీత్ రూపొందించిన ''OG' ప్రపంచంలో పవన్ కల్యాణ్ 'ఓజస్ గంభీర' అలియాస్ ''OG'గా చూపించిన స్టైల్, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు పార్ట్ 2 కోసం పవన్ కల్యాణ్ డేట్స్ కేటాయించారని తెలుస్తుండటంతో షూటింగ్ పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. మేకర్స్ ప్రాథమిక ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. సెప్టెంబర్ 2న బర్త్‌డే స్పెషల్ ప్రోమో?: ఇప్పటికే ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ''OG 2' కోసం ఒక ప్రత్యేకమైన యానిమేషన్ ప్రోమోను సిద్ధం చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ పుట్టినరోజైన సెప్టెంబర్ 2న ఈ స్పెషల్ ప్రోమోను విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తి కాగానే అభిమానుల కోసం రెగ్యులర్ అప్‌డేట్స్ ఇవ్వడం ప్రారంభించాలని ప్రొడక్షన్ టీమ్ భావిస్తోంది. ఇక పవన్ క్యారెక్టరైజేషన్, యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సీక్వెల్‌లో మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు టాక్. మరింత వినూత్నంగా సుజీత్ మేకింగ్: మొదటి భాగంలో పవన్ కళ్యాణ్‌ను ఒక రేంజ్‌లో చూపించిన సుజీత్, ''OG 2'ని అంతకుమించి తీర్చిదిద్దేందుకు పక్కా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇక యాక్షన్, ఎమోషన్ కలగలిపి గ్లోబల్ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పవర్ స్టార్ అభిమానులకు ''OG 2' ఒక గ్రాండ్ విజువల్ ట్రీట్‌లా ఉండబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కల్యాణ్ గ్రాండ్ ఎంట్రీ, సుజీత్ విజన్ కలగలిసి థియేటర్లలో ఏ స్థాయి సంచలనం సృష్టిస్తాయో వేచి చూడాలి.

# 'స్పిరిట్' లో ప్రభాస్ ఇంట్రోపై భారీ హైప్.. వంగా కొత్త ప్లాన్ ఇదేనా?



: టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాన్-ఇండియా స్థాయిలో హైప్ వున్నా మూవీస్ స్పిరిట్ కూడా ఒకటి. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఆయన పాత్రను ఎలా పరిచయం చేయబోతున్నారనే దానిపై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూ, అభిమానుల్లో క్యూరియాసిటీని రెట్టింపు చేస్తోంది. సెంట్రల్ జైల్లో అసలైన విధ్వంసం: తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా ఒక సెంట్రల్ జైలు వాతావరణంలో ప్రారంభమవుతుందట. జైల్లో ఉన్నట్టుండి పెద్ద గందరగోళం చెలరేగడం, నేరస్థులు నియంత్రణ కోల్పోవడం, అక్కడున్న పోలీసులు కూడా ఆ పరిస్థితిని అదుపు చేయలేక చేతులెత్తేయడం వంటి సన్నివేశంతో కథ మొదలవుతుంది. ఇక ఈ రచ్చ జరుగుతున్న సమయంలోనే ప్రభాస్ క్యారెక్టర్ ఎంట్రీకి వేదిక సిద్ధమవుతుందని తెలుస్తోంది. భయంతో వణికించే పేరు: అయితే ఈ సీన్‌లో ప్రభాస్‌ను వెంటనే చూపించకుండా, అక్కడి నేరస్థుల భయం ద్వారా ఆయన పవర్‌ను చూపిస్తారట. ఆ పోలీస్ ఆఫీసర్ పేరు వినగానే ఖైదీల ముఖాల్లో స్పష్టమైన భయం కనిపిస్తుందట. ఇక ఎటువంటి డిజైన్డ్ ఫైట్స్ లేదా భారీ డైలాగులు లేకుండా, కేవలం ఆయన పేరుతోనే ఆ పాత్ర ఎంత ప్రమాదకరమైనదో దర్శకుడు సందీప్ వంగా చాలా పవర్‌ఫుల్‌గా ఎస్టాబ్లిష్ చేయబోతున్నారట. పాత హిందీ పాటతో వినూత్నంగా ఇంట్రో: ప్రభాస్ ఎంట్రీ ఎంతో సైలెంట్‌గా, సైకోటిక్ రేంజ్‌లో ఉండబోతోందని టాక్. ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న ప్రభాస్ చాలా ప్రశాంతంగా, పాత హిందీ పాటలు వింటూ కేజువల్‌గా జైల్లోకి అడుగుపెడతారట. ఇక చుట్టూ ఉన్న నేరస్థులు భయంతో వణుకుతుంటే, ప్రభాస్ మాత్రం క్లాసిక్ సాంగ్ వింటూ కూల్‌గా కనిపించే ఈ కాంట్రాస్ట్ షాట్ సినిమాలోనే అతిపెద్ద హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు.




# సమంత మరో స్టార్ కి నో చెప్పిందా?



టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత, వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్. మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం సమంత దృష్టిని వెబ్ సిరీస్‌లు, పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లు , సొంత ప్రొడక్షన్ వెంచర్లపై ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. సినిమాల ఎంపికలో సామ్ అనుసరిస్తున్న సెలెక్టివ్ అప్రోచ్ ఆమె కెరీర్‌ను మరింత భిన్నమైన మార్గంలో నడిపిస్తోంది. భారీ ఆఫర్లను సైతం వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం పక్కన పెట్టే సమంత తెగింపు ఇండస్ట్రీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.



# నాకు అండగా ఆ ఇద్దరు హీరోలు

తన కష్టకాలంలో ఇద్దరు హీరోలు అండగా నిలుస్తారన్న అనుపమ

బాధలో ఉన్నప్పుడు దుల్కర్ సల్మాన్ నుంచి మెసేజ్ వస్తుందని వెల్లడి

దుల్కర్ తర్వాత రామ్ పోతినేనిని ఎక్కువగా విశ్వసిస్తానని స్పష్టం

మాజీ ప్రియుడి నుంచి ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి ప్రస్తావన

దుల్కర్‌తో కలిసి గతంలో మలయాళ చిత్రంలో నటించిన అనుపమ



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే. ఇదే సందర్భంగా, తన గత ప్రేమ సంబంధంలో ఎదుర్కొన్న మానసిక వేధింపుల (నార్సిసిస్టిక్ అబ్యూజ్) గురించి కూడా ఆమె ప్రస్తావించారు. అలాంటి వ్యక్తులు ఇతరులను ఎప్పుడూ తమ నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారని, ఇది చాలా నిశ్శబ్దంగా జరిగే వేధింపు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# మందుల కోసం భారీ క్యూ.. రోగుల అవస్థలు!

## కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల పంపిణీ కేంద్రం వద్ద భారీగా రద్దీ




కర్నూలు, సెప్టెంబర్ 3:: కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల కోసం రోగులు, వారి సహాయకులు భారీ సంఖ్యలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యులను సంప్రదించి మందుల చీటీ తీసుకున్న అనంతరం మందులు పొందేందుకు రోగులు మందుల పంపిణీ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో రోగులు రావడంతో మందుల కౌంటర్ వద్ద భారీ క్యూ ఏర్పడి, గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి కనిపించింది. అనారోగ్యంతో ఉన్న వృద్ధులు, మహిళలు, చిన్నారులతో వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా మందుల పంపిణీ కౌంటర్లను పెంచడంతో పాటు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి, వేగంగా మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.







# పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి




కర్నూలు, సెప్టెంబర్ 03: : జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమల భద్రత, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, మాక్ డ్రిల్స్ నిర్వహణపై జిల్లా క్రైసిస్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతా ప్రమాణాల అమలును ఫ్యాక్టరీస్ శాఖ అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరులోపు ఆఫ్‌సైట్ మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర పరిశ్రమల నుంచి అత్యవసర ప్రణాళికలను సేకరించినట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. పరిశ్రమలు తమ అత్యవసర ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీ.పీ.ఈ.) కార్మికులకు అందుబాటులో ఉంచడంతో పాటు వాటి వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కార్మికులకు భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై నిరంతరం శిక్షణ అందించాలని కలెక్టర్ తెలిపారు. పారిశ్రామిక భద్రత, అత్యవసర పరిస్థితుల సమర్థవంతమైన నిర్వహణకు అన్ని శాఖలు, పరిశ్రమల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి జిల్లాలోని కర్మాగారాల పరిస్థితిపై వివరాలను సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా రవాణా శాఖ అధికారి శాంతి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలి

## పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి.. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 03: జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించి, సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి టూరిజం అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పర్యాటక రంగ పురోగతిపై పర్యాటక కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రాలయం దేవాలయం సమీపంలో చేనేత ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని చేనేత అధికారులను ఆదేశించారు. చిన్నతుంబలం చెరువు, నాగలాపురం సుంకులమ్మ, వెంకాయపల్లె ఎల్లమ్మ తదితర ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలను గుర్తించి, మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అదేవిధంగా జగన్నాథ గట్టు, బ్రహ్మగుండం, ఉరుకుంద, కేతవరం తదితర పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన లీజు ప్రక్రియను పూర్తి చేసి తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా జిల్లాకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలను కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో టూరిజం అధికారి తిరుమల నాయుడు, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎస్‌ఈ మల్లికార్జున రెడ్డి, డ్వామా ఏపీడీ మాధవీలత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏపీటీడీసీ ఈఈ శివ నాగేశ్వరరావు, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.






## పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై

# ప్రత్యేక దృష్టి సారించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**




కర్నూలు, సెప్టెంబర్ 03: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల జారీ, విచారణ ప్రక్రియతో పాటు ఫారం--6 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్హత కలిగిన యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఫారం--6 దరఖాస్తులు సమర్పించి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఫారం--7, 8 దరఖాస్తుల పెండెన్సీని కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. అర్హత లేనివారిగా గుర్తించిన వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వారికి ఫారం--7 జనరేట్ చేయనున్నట్లు తెలిపారు. ఫారం--6, 7, 8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ రానున్న వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్‌వీఎస్‌పీ, బుక్ ఏ కాల్స్‌లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సి. వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.




# పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, దాతలను భాగస్వాములను చేయాలి

## పదో తరగతి ఫలితాల్లో కనీసం 10 శాతం మెరుగుదల సాధించాలి

## మధ్యాహ్న భోజనం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## విద్యార్థులకు మంచి నడవడిక, క్రమశిక్షణ నేర్పించాలి

## సానుకూల ప్రజాభిప్రాయంపై దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి




కర్నూలు, సెప్టెంబర్ 03: : పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, దాతలను భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు డివిజన్‌కు చెందిన ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల అభివృద్ధి, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, సానుకూల ప్రజాభిప్రాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అవసరానికి ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా దాతలు, పూర్వ విద్యార్థుల సహకారం పొందాలని సూచించారు. చిన్నపాటి మరమ్మతులు, బెంచీలు, క్రీడా సామగ్రి, తాగునీటి సదుపాయాల కోసం దాతలను ప్రోత్సహించాలని తెలిపారు. డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, దాతలను అనుసంధానం చేసి పాఠశాలల అభివృద్ధికి వారి సహకారం పొందాలని సూచించారు.

**పదో తరగతి ఫలితాల్లో 10 శాతం మెరుగుదల లక్ష్యం**

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని కనీసం 10 శాతం పెంచే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం సమీక్షిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు సందేహ నివృత్తి తరగతులు నిర్వహించాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్ వంటి అంశాల్లో విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరచాలని, ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానం, విద్యార్థులతో వారి సంబంధాలపై ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

**మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి**

విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, పౌష్టికమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్నం, కూరలు, సాంబారు తదితర ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పరిశీలించాలని సూచించారు. సక్రమంగా వంట చేయని వంట సిబ్బందిని మార్చాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాల్లో వెనుకబడిన పాఠశాలలను గుర్తించి ప్రత్యేకంగా సమీక్షిస్తామని తెలిపారు. పాఠశాలల పరిసరాలు, తరగతి గదులను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని, ఈ నెలలోగా పాఠశాల ప్రాంగణాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.

**విద్యార్థుల్లో మంచి నడవడిక పెంపొందించాలి**

విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఆత్మవిశ్వాసం, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించడంతో పాటు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యక్తిగత భద్రత, లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

**సానుకూల ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత**

ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సేవలు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం కల్పించేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సానుకూల ప్రజాభిప్రాయ సూచీలో జిల్లాను 15వ ర్యాంకులోపు తీసుకురావడానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి**

బాల్య వివాహాల నిర్మూలనకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 9, 10వ తరగతి విద్యార్థినులకు బాల్య వివాహాలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలని సూచించారు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలకు దూరం కాకుండా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బాలికల విద్యను కొనసాగించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. సుధాకర్, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహాల్లో పారిశుధ్యం, భోజన నాణ్యతపై రాజీ పడొద్దు

## వార్డెన్లు, వంట సిబ్బందికి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

## సెప్టెంబర్ నెలాఖరులోగా సోక్‌పిట్లు, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి




కర్నూలు, సెప్టెంబర్ 03: : జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అన్ని సంక్షేమ విభాగాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లతో సంక్షేమ శాఖల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలను తరచూ తనిఖీ చేస్తానని, తనిఖీల్లో లోపాలు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్డెన్లు, వంట సిబ్బంది, పారిశుధ్య సిబ్బందికి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు, గదులు, ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత వార్డెన్లు, సిబ్బందిపై ఉందన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు తల్లిదండ్రుల మాదిరిగా సంరక్షణ, ఆప్యాయత అందించాలని సూచించారు. ఎంఈఓలు, ఎంపీడీఓలు, సహాయ బీసీ సంక్షేమ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ఈ విద్యా సంవత్సరంలో గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతాన్ని కనీసం 15 శాతానికి పైగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాల్లో తాగునీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని సూచించారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలని, మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్నం సక్రమంగా ఉడికించడంతో పాటు విద్యార్థులందరికీ సరిపడా పరిమాణంలో భోజనం అందించాలని సూచించారు. భోజన బిల్లులు, ఖర్చులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిమాణం, నాణ్యతను సరిపోల్చి పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. నాసిరకం భోజనం అందిస్తూ బిల్లులు పొందుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డెన్లు, సంబంధిత సిబ్బంది తమకు కేటాయించిన ప్రధాన కార్యాలయాల్లోనే నివాసం ఉండేలా చూడాలని ఆదేశించారు. వసతి గృహాల్లో సోక్‌పిట్లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, మొక్కల పెంపకం పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ నరసింహ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

## 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి

## ఈ-ఆటోల డ్రైవర్లకు కమిషనర్ చల్లా ఓబులేసు సూచనలు



కర్నూలు, సెప్టెంబర్ 03:: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎలక్ట్రిక్ ఆటోలను సమర్థవంతంగా వినియోగిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు డ్రైవర్లకు సూచించారు. గురువారం విశాల్ మార్ట్ సమీపంలోని ఈ-ఆటోల ఛార్జింగ్ స్టేషన్ వద్ద ఈ-ఆటోల పార్కింగ్, చెత్త బదిలీ కేంద్రం, ఛార్జింగ్ పాయింట్ల పనితీరును పరిశీలించి డ్రైవర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన డ్రైవర్లు నగరపాలక సంస్థ కుటుంబంలో సభ్యులని, విధుల్లో బాధ్యత, నిబద్ధతతో పనిచేయడం ఎంతో అవసరమన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ-ఆటోల నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఏజెన్సీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్ తెలిపారు. వాహనాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ చెత్త సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్ మునిస్వామి, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం

## మృతి చెందిన హోంగార్డు భార్యకు నియామక ఉత్తర్వుల పత్రం అందజేత

## ఉత్తర్వుల పత్రం అందజేసిన ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. కృష్ణమోహన్



కర్నూలు, సెప్టెంబర్ 03: కర్నూలు యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించారు. హోంగార్డు కె. కృష్ణ 2026 ఏప్రిల్ 18న గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భార్య కె. సునీతకు కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం కల్పిస్తూ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. కృష్ణమోహన్ సునీతకు హోంగార్డు ఉద్యోగ నియామక ఉత్తర్వుల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచే ఉద్దేశంతో కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఏఆర్ఎస్ఐ ఎస్.ఎల్. కాంతారెడ్డి, హోంగార్డ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో మౌలిక వసతుల

# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

కర్నూలు, సెప్టెంబర్ 03: కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి కేంద్రీయ విద్యాలయ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతుల మెరుగుదల కోసం నిర్వహణ, మరమ్మతుల కింద మంజూరైన పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సులభంగా రాకపోకలు సాగించేందుకు గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తు వరకు ర్యాంప్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, ర్యాంప్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు కీలకమైనవని తెలిపారు. వీటికి హెడ్‌క్వార్టర్స్ నుంచి త్వరితగతిన అనుమతులు పొందేందుకు అవసరమైన ప్రతిపాదనలు, సిఫార్సులు సమర్పించి ఫాలోఅప్ చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో 2 నుంచి 3 ఎకరాల ఖాళీ స్థలం ఉందని, మైదానం పరిసరాలను శుభ్రం చేసినప్పటికీ పెద్ద రాళ్లు ఉండటంతో విద్యార్థులు ఆటలు ఆడుకోలేకపోతున్నారని ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మైదానం అభివృద్ధికి నగరపాలక సంస్థ కమిషనర్‌తో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల హైవే సమీపంలో ఉన్నందున విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇద్దరు పోలీసులను కేటాయించాలని ప్రిన్సిపల్ కోరగా, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ ప్రియదర్శిని మాట్లాడుతూ నిర్వహణ, మరమ్మతుల కింద మంజూరైన పనుల్లో రూఫ్ వాటర్‌ప్రూఫింగ్ పూర్తయిందని, ఫ్లోర్ ట్రీట్‌మెంట్ పని 85 శాతం పూర్తయిందని తెలిపారు. రోడ్డు పనికి కూడా మంజూరు లభించిందని, మిగిలిన పనులకు ప్రాధాన్యత ఆధారంగా నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 2024--25లో పీఎం శ్రీ పథకం కింద 98 శాతానికి పైగా, 2025--26లో 93.85 శాతం నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. క్రీడల్లో ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వచ్చే ఏడాది ఈ సంఖ్యను రెట్టింపు చేసే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. 10వ, 12వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సమావేశంలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ మ్యాథ్స్ టీచర్ షేక్‌షావలి, సీజీఈడబ్ల్యూసీసీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ జనార్దన్ రెడ్డి, టెక్నికల్ మెంబర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి సందర్భంగా ప్రజలకు

# మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి అవతారం ధర్మ పరిరక్షణకు, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. సమాజంలో ధర్మాన్ని స్థాపించి, ప్రజలను సన్మార్గంలో నడిపించిన శ్రీకృష్ణుడి బోధనలు నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, పేదలు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన దిశగా ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు.

# రక్తంలో షుగర్ పెరిగితే డయాబెటిస్ ఉన్నట్టేనా?.. వాస్తవాలేంటి?

**డయాబెటిస్ లేనివారిలోనూ రక్తంలో చక్కెర తాత్కాలికంగా పెరిగే ఛాన్స్**

**ఆహారం, ఒత్తిడి, నిద్రలేమి దీనికి కారణం కావచ్చంటున్న వైద్య నిపుణులు**

**కఠినమైన వ్యాయామం తర్వాత కూడా షుగర్ లెవల్స్ తాత్కాలికంగా పెరుగుతాయని వెల్లడి**

**పదేపదే రీడింగ్స్ ఎక్కువగా వస్తేనే వైద్యుడిని సంప్రదించాలని సూచన**



తరచూ షుగర్ పెరగడం ప్రీడయాబెటిస్‌కు తొలి సంకేతం కావొచ్చని వ్యాఖ్య

రక్తంలో చక్కెర (గ్లూకోజ్) స్థాయిలు అకస్మాత్తుగా పెరగడాన్ని చాలామంది డయాబెటిస్‌గా భావిస్తుంటారు. కానీ, డయాబెటిస్ లేని ఆరోగ్యవంతులలో కూడా షుగర్ లెవల్స్ తాత్కాలికంగా పెరగడం సాధారణమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుంది? ఎంత తరచుగా పెరుగుతుంది? తిరిగి సాధారణ స్థాయికి వస్తుందా లేదా? అనేదే ముఖ్యమైన విషయం. మనం తినే ఆహారం, చేసే వ్యాయామం, నిద్రపోయే సమయం, అనుభవించే ఒత్తిడి వంటి అనేక అంశాల ఆధారంగా మన శరీరం గ్లూకోజ్ స్థాయిలను నిరంతరం సర్దుబాటు చేసుకుంటుంది. అందుకే ఒక్కసారి రీడింగ్ ఎక్కువగా వచ్చినంత మాత్రాన డయాబెటిస్ ఉందని నిర్ధారించుకోలేం.

ఆహారం, ఒత్తిడి కీలక పాత్ర

మనం పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్లు) ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు, జీర్ణవ్యవస్థ వాటిని గ్లూకోజ్‌గా విడగొడుతుంది. ఈ గ్లూకోజ్ రక్తంలో కలిసి షుగర్ స్థాయిలను పెంచుతుంది. దీనికి ప్రతిస్పందనగా క్లోమం ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఈ ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను కండరాలు, ఇతర కణజాలాల్లోకి చేరవేసి శక్తిగా మార్చడంలో సహాయపడుతుంది. తెల్ల అన్నం, బంగాళాదుంపలు, తీపి పానీయాలు వంటివి షుగర్ లెవల్స్‌ను వేగంగా పెంచుతాయి. అదే సమయంలో ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన ఆహారం తీసుకుంటే గ్లూకోజ్ నెమ్మదిగా రక్తంలో కలుస్తుంది.

అంతేగాక తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు కూడా షుగర్ రీడింగ్స్ ఎక్కువగా ఉండొచ్చు. ఒత్తిడి సమయంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి కాలేయంలో నిల్వ ఉన్న గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేయమని సంకేతాలిస్తాయి. ఇది శరీర సహజ ప్రతిస్పందన అయినప్పటికీ, తాత్కాలికంగా షుగర్ లెవల్స్ పెరుగుతాయి. అనారోగ్యం, జ్వరం, నిద్రలేమి వంటివి కూడా ఇన్సులిన్ పనితీరును ప్రభావితం చేసి గ్లూకోజ్ స్థాయిలను పెంచుతాయి.

వ్యాయామం, మందుల ప్రభావం

ఏరోబిక్స్ వంటి వ్యాయామాలు సాధారణంగా రక్తంలో చక్కెరను తగ్గించడానికి సహాయపడతాయి. అయితే, కఠినమైన వ్యాయామం చేసినప్పుడు శరీరం శక్తి కోసం అడ్రినలిన్‌ను విడుదల చేస్తుంది. ఇది కాలేయం నుండి ఎక్కువ గ్లూకోజ్‌ను రక్తంలోకి పంపేలా చేస్తుంది. ఫలితంగా వ్యాయామం తర్వాత కొంతసేపు షుగర్ లెవల్స్ పెరిగినట్టు కనిపించవచ్చు. అయితే, క్రమం తప్పని వ్యాయామం దీర్ఘకాలంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. కొన్ని రకాల మందులు, ముఖ్యంగా స్టెరాయిడ్స్ వంటివి కూడా గ్లూకోజ్ స్థాయిలను పెంచుతాయి. కొత్త మందులు వాడిన తర్వాత రీడింగ్స్ తరచుగా ఎక్కువగా ఉంటే, మీరే మందులు ఆపకుండా వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం.

ఎప్పుడు తీవ్రంగా పరిగణించాలి?

ఒక్కసారి రీడింగ్ ఎక్కువగా వచ్చినంత మాత్రాన కంగారు పడాల్సిన పనిలేదు. కానీ, తరచుగా రీడింగ్స్ ఎక్కువగా వస్తుంటే, దానికి తోడు అధిక దాహం, తరచుగా మూత్రవిసర్జన, కారణం లేకుండా బరువు తగ్గడం, తీవ్రమైన అలసట, దృష్టి మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పదేపదే గ్లూకోజ్ స్థాయిలు పెరగడం అనేది శరీరం ఇన్సులిన్‌కు తక్కువగా స్పందిస్తుందనడానికి సంకేతం. దీన్నే 'ప్రీడయాబెటిస్' అంటారు. ఈ దశలో లక్షణాలు కనిపించకపోవచ్చు.

అందుకే అధిక బరువు, కుటుంబంలో డయాబెటిస్ చరిత్ర, అధిక రక్తపోటు వంటి ప్రమాద కారకాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవడం మంచిది. వైద్యులు ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్, ఎహెచ్1సి వంటి పరీక్షలు చేసి గత 2-3 నెలల సగటు గ్లూకోజ్ స్థాయిలను అంచనా వేస్తారు. అంతిమంగా ఒక షుగర్ రీడింగ్ అనేది కేవలం ఒక కొలమానం మాత్రమే, అదే వ్యాధి నిర్ధారణ కాదు. తరచుగా రీడింగ్స్ ఎక్కువగా ఉంటేనే దాన్ని తీవ్రంగా పరిగణించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# సూక్ష్మ పోషకాలు: ఏవి ఎందుకు అవసరమో తెలుసుకోండి!

**శరీరానికి తక్కువ మోతాదులో అవసరమయ్యే విటమిన్లు, ఖనిజాలే సూక్ష్మ పోషకాలు**

**రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉత్పత్తికి ఇవి అత్యంత కీలకం**

**విటమిన్ ఎ కంటి చూపుకు, ఐరన్ రక్త వృద్ధికి, కాల్షియం ఎముకల పటిష్టతకు అవసరం**



సమతుల ఆహారం ద్వారానే ఈ పోషకాలను తగినంతగా పొందడం సాధ్యం

మన శరీరం ఒక సంక్లిష్టమైన యంత్రం లాంటిది. ఇది సక్రమంగా పనిచేయాలంటే కేవలం పిండిపదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు వంటి స్థూల పోషకాలు మాత్రమే సరిపోవు. వాటితో పాటు చాలా తక్కువ పరిమాణంలో అవసరమయ్యే విటమిన్లు, ఖనిజ లవణాలు కూడా అత్యంత కీలకం. వీటినే సూక్ష్మ పోషకాలు అని పిలుస్తారు. ఇవి మన శరీరానికి నేరుగా శక్తిని ఇవ్వకపోయినా, జీవక్రియలు సజావుగా సాగడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, అవయవాల పనితీరులో కీలక పాత్ర పోషిస్తాయి. రోజువారీ ఆహారంలో మనం తీసుకునే పదార్థాల ద్వారానే వీటిని పొందగలం. మన ఆరోగ్యానికి అత్యవసరమైన కొన్ని ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు, వాటి ఉపయోగాలు, అవి లభించే ఆహార పదార్థాల జాబితా ఇక్కడ ఉంది.

విటమిన్లు:

విటమిన్ ఎ: ఇది కంటి చూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రేచీకటి వంటి సమస్యలను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. క్యారెట్లు, గుమ్మడికాయ, చిలగడదుంప, ఆకుకూరల్లో ఇది పుష్కలంగా లభిస్తుంది.

విటమిన్ బి12: శరీరంలో ఎర్ర రక్త కణాల తయారీకి, నరాల వ్యవస్థ పనితీరుకు ఇది చాలా అవసరం. డీఎన్ఏ సంశ్లేషణలోనూ దీనిది ముఖ్యమైన పాత్ర. శాకాహారులలో దీని లోపం ఎక్కువగా కనిపిస్తుంది. పాలు, గుడ్లు, చేపలు, మాంసం వంటి వాటిలో ఇది లభిస్తుంది.

ఫోలేట్ (విటమిన్ బి9): గర్భిణులకు ఇది అత్యంత ముఖ్యమైన విటమిన్. కణ విభజన, డీఎన్ఏ తయారీ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి ఫోలేట్ అవసరం. ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, శనగల్లో ఇది సమృద్ధిగా ఉంటుంది.



విటమిన్ సి: ఇది ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. చర్మం, ఎముకలు, కండరాలను కలిపి ఉంచే కొల్లాజెన్ తయారీకి ఇది కీలకం. శరీరం ఐరన్‌ను గ్రహించడానికి కూడా సహాయపడుతుంది. ఉసిరి, జామ, నారింజ, నిమ్మ వంటి పండ్లలో ఇది అధికంగా ఉంటుంది.

విటమిన్ డి: 'సన్‌షైన్ విటమిన్' అని పిలిచే ఇది, శరీరం కాల్షియంను గ్రహించడానికి చాలా అవసరం. ఎముకలు, దంతాల పటిష్టతకు, కండరాల పనితీరుకు ఇది కీలకం. సూర్యరశ్మి ద్వారా శరీరం దీన్ని తయారు చేసుకుంటుంది. కొవ్వు ఉన్న చేపలు, గుడ్లలోనూ లభిస్తుంది.

విటమిన్ ఇ: ఇది కూడా ఒక యాంటీఆక్సిడెంట్. శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నష్టం నుంచి కాపాడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. బాదం, వేరుశనగ, పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇది ఎక్కువగా ఉంటుంది.

విటమిన్ కె: రక్తం గడ్డకట్టే ప్రక్రియలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. గాయాలు తగిలినప్పుడు అధిక రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఎముకల ఆరోగ్యానికి కూడా ఇది చాలా అవసరం. ఆకుపచ్చని ఆకుకూరలు, బ్రోకలీలో విటమిన్ కె సమృద్ధిగా దొరుకుతుంది.

ఖనిజాల లవణాలు

ఐరన్: శరీరంలో హిమోగ్లోబిన్ తయారీకి ఐరన్ అత్యంత కీలకం. ఇది ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది. దీని లోపం వల్ల రక్తహీనత వస్తుంది. ఆకుకూరలు, పప్పులు, మాంసం, బెల్లంలో ఇది అధికంగా లభిస్తుంది.

కాల్షియం: ఎముకలు, దంతాల నిర్మాణానికి, వాటి పటిష్ఠతకు కాల్షియం ప్రధాన ఆధారం. కండరాల సంకోచ వ్యాకోచాలకు, నరాల పనితీరుకు కూడా ఇది అవసరం. పాలు, పెరుగు, నువ్వులు, రాగి వంటి వాటిలో కాల్షియం పుష్కలంగా దొరుకుతుంది.

మెగ్నీషియం: శరీరంలో జరిగే వందలాది జీవక్రియలకు మెగ్నీషియం అవసరం. శక్తి ఉత్పత్తి, కండరాలు, నరాల పనితీరును నియంత్రిస్తుంది. గింజలు, విత్తనాలు, ఆకుకూరలలో ఇది సమృద్ధిగా ఉంటుంది.

జింక్: రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి జింక్ చాలా ముఖ్యం. గాయాలు త్వరగా మానడానికి, డీఎన్ఏ, ప్రొటీన్ల సంశ్లేషణకు సహాయపడుతుంది. పప్పులు, గింజలు, మాంసంలో జింక్ లభిస్తుంది.

అయోడిన్: థైరాయిడ్ గ్రంథి సరైన రీతిలో పనిచేయడానికి, థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి అయోడిన్ అవసరం. అయోడైజ్డ్ ఉప్పు, సముద్రపు చేపలలో ఇది ఉంటుంది.

పొటాషియం: శరీరంలోని ద్రవాల సమతుల్యతను కాపాడటంలో, నరాల సంకేతాలను ప్రసారం చేయడంలో, కండరాల పనితీరులో ఇది సహాయపడుతుంది. అరటిపండు, బంగాళాదుంప, పప్పు ధాన్యాలలో ఇది ఎక్కువగా దొరుకుతుంది.

సెలీనియం: ఇది కూడా ఒక యాంటీఆక్సిడెంట్. థైరాయిడ్ పనితీరుకు, కణాలను నష్టం నుంచి కాపాడటానికి సహాయపడుతుంది. చేపలు, గుడ్లు, గింజలలో సెలీనియం లభిస్తుంది.

కాబట్టి, మన రోజువారీ ఆహారంలో రంగురంగుల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, గింజలు చేర్చుకోవడం ద్వారా ఈ సూక్ష్మ పోషకాలను తగినంతగా పొంది, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తుంచుకోవాలి.

# జిమ్ చేస్తున్నారా? హెల్తీగా తింటున్నారా? అయినా హార్ట్ ఎటాక్ రావొచ్చు.. కారణమేంటంటే!

జిమ్‌కు వెళ్తున్నారు.. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు.. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నారు.. బరువు కూడా అదుపులోనే ఉంది. మరి గుండెకు ఎలాంటి ప్రమాదం ఉండదని అనుకుంటున్నారా? అది పూర్తిగా నిజం కాదు. బయటికి ఎంతో ఫిట్‌గా కనిపించే వ్యక్తుల్లోనూ గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి.. శరీరంలో నిశ్శబ్దంగా పెరిగే అధిక కొలెస్ట్రాల్!

భారత్‌లో ముఖ్యంగా యువతలో గుండెపోటు కేసులు పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సాధారణంగా అధిక బరువు, వ్యాయామం లేకపోవడం, ధూమపానం వంటి వాటినే గుండెపోటుకు ప్రధాన కారణాలుగా భావిస్తాం. అయితే ఫిట్‌నెస్ ఒక్కటే గుండె ఆరోగ్యానికి పూర్తి రక్షణ ఇవ్వదని నిపుణులు చెబుతున్నారు.

ఫిట్‌గా ఉన్నా.. గుండెకు ముప్పు ఎలా?

ఓ 44 ఏళ్ల వ్యక్తిని ఉదాహరణగా తీసుకుంటే.. అతను క్రమం తప్పకుండా హాఫ్ మారథాన్‌లో పాల్గొనేవాడు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవాడు. ధూమపానం చేసేవాడు కాదు. బరువు కూడా సాధారణంగానే ఉండేది. అయితే పరుగెత్తుతున్న సమయంలో ఛాతిలో అసౌకర్యం కలగడంతో వైద్యులను సంప్రదించాడు. సాధారణ పరీక్షల్లో పెద్దగా సమస్య కనిపించలేదు. కానీ రక్త పరీక్షలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 190 ఎమ్జి/డీఎల్‌గా తేలింది. తదుపరి పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో ఏకంగా 90 శాతం బ్లాకేజీ ఉన్నట్లు గుర్తించారు. చివరకు అతనికి యాంజియోప్లాస్టీ చేయాల్సి వచ్చింది.

కొలెస్ట్రాల్ అంటే లావు మాత్రమే కాదు!

కొలెస్ట్రాల్ గురించి చాలామందిలో ఒక అపోహ ఉంది. శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉంటేనే కొలెస్ట్రాల్ పెరుగుతుందని భావిస్తారు. కానీ అది నిజం కాదు. కొలెస్ట్రాల్‌లో ఎక్కువ భాగాన్ని మన శరీరమే, ముఖ్యంగా కాలేయం, ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల సన్నగా ఉన్నవారిలోనూ కొలెస్ట్రాల్ స్థాయిలు ప్రమాదకరంగా పెరగవచ్చు.

ముఖ్యంగా ఫ్యామిలియల్ హైపర్‌కొలెస్టెరోలీమియా వంటి జన్యుపరమైన పరిస్థితులు ఉన్నవారిలో మంచి ఆహారం తీసుకున్నా, రోజూ వ్యాయామం చేసినా ఎల్‌డీఎల్ స్థాయిలు అధికంగా ఉండొచ్చు.

అసలు ప్రమాదం ఏంటంటే..

అధిక కొలెస్ట్రాల్‌ను 'సైలెంట్ కిల్లర్' అని ఎందుకు అంటారు. అది పెరుగుతున్నప్పుడు సాధారణంగా ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. రక్తంలో అధికంగా ఉన్న ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ క్రమంగా ధమనుల గోడల్లో పేరుకుపోతుంది. కాలక్రమంలో అక్కడ ఫ్లాక్ ఏర్పడి రక్తనాళాలను ఇరుకుగా చేస్తుంది. గుండెకు రక్త సరఫరా తగ్గే వరకు చాలామందికి తమ శరీరంలో ఏం జరుగుతుందో తెలియకపోవచ్చు.



ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణ అలసట వంటి లక్షణాలు కనిపించే సమయానికి సమస్య ఇప్పటికే ముదిరి ఉండొచ్చు. కొందరిలో అయితే హార్ట్ ఎటాక్ రావడమే మొదటి హెచ్చరికగా మారుతుంది.

భారతీయులకు మరింత జాగ్రత్త అవసరం

భారతీయుల్లో ఇతర పాశ్చాత్య జనాభాతో పోలిస్తే తక్కువ వయసులోనే కరోనరీ ఆర్టరీ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే చిన్న వయసులో ఉన్నాం, ఫిట్‌గా ఉన్నాం, జిమ్ చేస్తున్నాం కాబట్టి గుండె విషయంలో ఎలాంటి పరీక్షలు అవసరం లేదనుకోవడం సరికాదు. ముఖ్యంగా కుటుంబంలో చిన్న వయసులోనే గుండెజబ్బులు వచ్చిన చరిత్ర ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలి.

30 ఏళ్లకే కొలెస్ట్రాల్ పరీక్ష?

నిపుణుల సూచన ప్రకారం కొలెస్ట్రాల్ స్థాయిలను చిన్న వయసులోనే పరీక్షించుకోవడం మంచిది. సాధారణ లిపిడ్ ప్రొఫైల్ ద్వారా ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్, ట్రైగ్లిజరైడ్స్ వంటి ముఖ్యమైన వివరాలు తెలుసుకోవచ్చు. అవసరాన్ని బట్టి వైద్యులు లైపోప్రొటీన్(ఖ), ాజూశీదీ, ఎల్‌డీఎల్ పార్టికల్ టెస్టింగ్, సీఏసీ స్కోరింగ్ వంటి అదనపు పరీక్షలను సూచించవచ్చు. ముఖ్యంగా కుటుంబ చరిత్ర, వయసు, ఇతర ఆరోగ్య పరిస్థితులను బట్టి ఏ పరీక్ష అవసరమో వైద్యుడే నిర్ణయించాలి.

వ్యాయామం ఆపేయాలా? అస్సలు కాదు!

అధిక కొలెస్ట్రాల్ ప్రమాదం ఉందని తెలుసుకున్నంత మాత్రాన వ్యాయామాన్ని ఆపేయాల్సిన అవసరం లేదు. వ్యాయామం, సమతుల ఆహారం, సరైన బరువు.. ఇవన్నీ గుండె ఆరోగ్యానికి ముఖ్యమైనవే. అయితే అవి మాత్రమే సరిపోవు. వాటితో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా అవసరం. బయటికి కనిపించే ఫిట్‌నెస్ మన ఆరోగ్యానికి ఒక భాగం మాత్రమే. రక్తంలో దాగి ఉన్న కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తెలుసుకోవాలి.

**గమనిక:** ఈ సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. వైద్య సలహాకు ప్రత్యామ్నాయంగా భావించొద్దు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వైద్యులను సంప్రదించాలి.

# తిన్నది వంటపట్టడం లేదా?

**రోజూ ఇలా చేయండి!**

**ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ కోసం నిపుణులు సూచిస్తున్న సాధారణ అలవాట్లు**

**ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినాలి**

**భోజనానికి, నిద్రకు మధ్య కనీసం రెండు గంటల విరామం అవసరం**

**తిన్న వెంటనే కాసేపు నెమ్మదిగా నడవడం జీర్ణక్రియకు మేలు**

**తగినంత నీరు తాగడం, మితంగా తినడం చాలా ముఖ్యం**

మనం తీసుకునే ఆహారం శరీరానికి శక్తినివ్వాలి. కానీ, ఆధునిక జీవనశైలిలో చాలామందికి తిన్నది సరిగ్గా జీర్ణం కాక గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. మనం తినే పద్ధతిలో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ ఇబ్బందులను సులభంగా అధిగమించవచ్చు. తిన్న ఆహారం సక్రమంగా వంటపట్టి, శరీరం ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడే ముఖ్యమైన అలవాట్ల గురించి తెలుసుకుందాం.



1. నెమ్మదిగా నమిలి తినడం

జీర్ణప్రక్రియ కడుపులో కాదు, నోట్లోనే మొదలవుతుంది. ఆహారాన్ని ఎంత బాగా నమిలితే, లాలాజలంలోని ఎంజైమ్‌లతో అంత బాగా కలిసి చిన్న ముక్కలుగా మారుతుంది. దీనివల్ల కడుపుపై భారం తగ్గి, జీర్ణక్రియ సులభమవుతుంది. చాలామంది హడావుడిగా, సరిగ్గా నమలకుండా మింగేస్తుంటారు. దీనివల్ల పెద్ద ఆహార ముక్కలను అరిగించడానికి జీర్ణాశయం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. ఫలితంగా అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే ప్రతి ముద్దను కనీసం 20 నుంచి 30 సార్లు నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఇది త్వరగా కడుపు నిండిన భావన కలిగించి, అతిగా తినడాన్ని కూడా నియంత్రిస్తుంది.

2. సమయపాలన పాటించడం

మన శరీరానికి ఒక జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ఉంటుంది. రోజూ ఒకే సమయానికి భోజనం చేయడం వల్ల, ఆ సమయానికి జీర్ణరసాలు సక్రమంగా విడుదలై జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. సమయం కాని సమయాల్లో తినడం, భోజనం మానేయడం జీర్ణవ్యవస్థను గందరగోళానికి గురిచేస్తుంది. ముఖ్యంగా, తిన్న వెంటనే నిద్రపోవడం లేదా వ్యాయామం చేయడం వంటివి అస్సలు మంచిది కాదు. భోజనం తర్వాత కనీసం 10-15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రాత్రిపూట వీలైనంత త్వరగా భోజనం చేయడం అత్యంత ముఖ్యమైన అలవాటు. దీనివల్ల జీర్ణవ్యవస్థకు రాత్రంతా దాదాపు 10 నుంచి 12 గంటల పాటు పూర్తి విశ్రాంతి లభిస్తుంది.

3. సరైన మోతాదులో ఆహారం, నీరు

శరీరానికి నీరు చాలా అవసరం. కానీ భోజనం చేసేటప్పుడు ఎక్కువగా నీరు తాగితే, జీర్ణరసాలు పలుచబడి జీర్ణక్రియ మందగిస్తుంది. అందుకే భోజనానికి అరగంట ముందు, తిన్న అరగంట తర్వాత నీళ్లు తాగడం ఉత్తమమైన పద్ధతి. అలాగే, కడుపు బిగిసేలా తినకుండా, కాస్త ఖాళీ ఉంచుకొని మితంగా తినాలి. ఒకేసారి ఎక్కువ ఆహారం తీసుకోవడం జీర్ణాశయంపై తీవ్ర ఒత్తిడిని పెంచి, అజీర్ణానికి దారితీస్తుంది.



ఈ మూడు సాధారణ అలవాట్లను మన దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే, ఎలాంటి మందులు లేకుండానే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేసుకోవచ్చు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను
# గడువులోగా పూర్తి చేసేలా చర్యలు

సీఈఓ వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న విచారణలను, ఇతర ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణాజిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి పాల్గొని జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించి 16.49 శాతం విచారణలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గన్నవరం ప్రాంతంలో 24 శాతం విచారణలు పెండింగ్‌లో ఉండగా, వాటిని వేగవంతం చేసేందుకు అదనంగా ఏఆర్ఓలను నియమించినట్లు చెప్పారు. గన్నవరం మినహా మిగిలిన ప్రాంతాల్లో విచారణ ప్రక్రియను సెప్టెంబర్ 10 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గన్నవరం ప్రాంతానికి మాత్రం మరో ఐదు రోజుల అదనపు సమయం అవసరమవుతుందని వివరించారు. ఫారమ్‌లకు సంబంధించి ఫారమ్-8 వరకు ప్రక్రియను ప్రస్తుతం డ్రై రన్ తరహాలో నిర్వహిస్తున్నామని, జిల్లాలో అధిక సంఖ్యలో ఫారమ్‌లను ప్రాసెస్ చేస్తున్నందున వాటి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని తెలిపారు. ఫారమ్-6, ఫారమ్-7 ప్రక్రియలు కూడా సజావుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో మిగిలిన అన్ని పనులను సెప్టెంబర్ 15 నాటికి దాదాపుగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి కే శ్రీధర్ రెడ్డి, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల విభజనపై
## కానూరులో గ్రామసభ - జాబితాకు ఆమోదం

ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కానూరు గ్రామ పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల విభజనపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గురువారం కానూరు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు గ్రామ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎం.వీ.ఎస్. దుర్గ ప్రసాద్ అధ్యక్షతన ఈ సభ జరిగింది. ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతి పంచాయతీలో ఓటర్ల గుర్తింపు చేపడుతున్నామన్నారు. కానూరు పంచాయతీలో మొత్తం బీసీ ఓటర్లు 1233, ఎస్సీ ఓటర్లు 54, ఎస్టీ 1, ఓసీ ఓటర్లు 895 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఈ జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో గ్రామసభలో ఆమోదించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వో సుబ్బయ్య దాస్, పీత రాము, దివి మహేష్, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, గోపు వెంకటరమణ, మోకా రాజు, ఆముదలపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం
## ఆగదు, ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో నిరసనలు



విజయవాడ శ్రీ వార్త న్యూస్: ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కార్యాలయాలు, కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నిరసనలు నిర్వహించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని ఏపీజేఏసీ నాయకులు కోరారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటం కొనసాగిస్తామని, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని నాయకులు స్పష్టం చేశారు. జిల్లాలోని ఇతర ప్రధాన ఉద్యోగ సంఘాలు కూడా ముందుకు వచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టీ. నాగేశ్వరరావు, జిల్లా చైర్మన్ ఎం.వి. శ్యామ్ నాథ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి. రావు, సీహెచ్. గోపాల్, గోపి చంద్ తదితర జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. తదుపరి కార్యాచరణకు ఉద్యోగులందరూ ఐక్యంగా మద్దతు ఇవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు.

## అంగన్‌వాడీల్లో అవకతవకలు -

టీచర్లు, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆహార కమిషన్ ఆదేశం



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్: కృష్ణా జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి రెండో రోజు వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుండుపాలెం సాక్షం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు, గుడ్ల పంపిణీ, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించారు. జలగలగండిలో సెప్టెంబర్ 1 నుంచి గుడ్ల స్టాక్ లేకపోవడం, ఆన్‌లైన్‌లో 3/3 హాజరు చూపినా కేంద్రంలో పిల్లలు లేకపోవడాన్ని గుర్తించారు. లంకపల్లి 1ఔ3 కేంద్రంలో రంగు గుర్తులు లేని, 35 గ్రాముల బరువు గల గుడ్లు పంపిణీ చేయడం, ఆన్‌లైన్‌లో 6/6 హాజరు చూపి కేవలం 2 మంది పిల్లలు ఉండటాన్ని గుర్తించారు. ఈ రెండు కేంద్రాల టీచర్లు, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మచవరం ఎఫ్.పి. షాప్ నంబర్ 0681629లో రేషన్ నిల్వలు, పంపిణీ రికార్డులు, ఘంటసాల ఎంపీపీ స్కూల్, మోపిదేవి మహాత్మా జ్యోతిబా పూలే బాయ్స్ రెసిడెన్షియల్ పాఠశాల,





చల్లపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూ, గుడ్ల సరఫరాను పరిశీలించారు. ఆన్‌లైన్ హాజరులో వాస్తవాలకు భిన్నంగా నమోదు చేస్తే చర్యలు తప్పవని, గుడ్ల నాణ్యత, బరువు, రంగు మార్కింగ్ పై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి టీ శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదం

విద్యార్థులు బాల్యం నుంచే యోగాను అలవర్చుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు

సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొన్న మంతెన, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి






గుడివాడ శ్రీ వార్త న్యూస్ : ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో దోహదపడుతుందని, ముఖ్యంగా విద్యార్థులు బాల్యం నుంచే యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సూచించారు. గురువారం గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యోగా సాధకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ.. యోగా సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, చక్కటి ఆలోచనా శక్తి, మానసిక ప్రశాంతత పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో యోగాకు కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. బాల్యం నుంచే యోగాను అభ్యసించడం ద్వారా మంచి ఆహారపు అలవాట్లు, సానుకూల ఆలోచనా విధానం, క్రమశిక్షణ అలవడతాయని తెలిపారు. ఇవి విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు, విజయాలు సాధించేందుకు దోహదపడతాయన్నారు. ఆరోగ్యకరమైన ప్రపంచం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగా ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం యోగా కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు.

**ఆరోగ్యంగా ఉంటేనే ఆనందం, విజయాలు..**

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, అందులో యోగాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగా, ప్రాణాయామం, ధ్యానానికి కేటాయిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక చురుకుదనం, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా తరగతి గదిలో పాఠాలను ఏకాగ్రతతో అర్థం చేసుకుని, అకడమిక్ పనితీరును మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, వ్యాధులు రాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే 'యోగాంధ్ర' కార్యక్రమాలతో పాటు యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసేందుకు 'సంజీవని' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు చేస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అధికారులు, నిర్వాహకులు, విద్యార్థులు, యోగా సాధకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రావు, యోగా గురువులు వర్రే లీలావతి, యు శ్రీనివాస్, ముదిగొండ శాస్త్రి,



## కృష్ణం వందే జగద్గురుం.. శ్రీ కృష్ణుని బోధనలు
# సకల మానవాళికి స్ఫూర్తి దాయకం

(ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు)







హైదరాబాదు శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి ): హిందూ సంప్రదాయంలో శ్రీకృష్ణుడు విష్ణువు యొక్క ఎనిమిదవ అవతారంగా, పరిపూర్ణావతారంగా, మరియూ జగద్గురువుగా పూజింపబడే దేవుడు. బాల్యంలో బృందావనం, గోకులంలో చిలిపి చేష్టలు, వెన్న దొంగిలించడం, గోపికలలతో లీలలు, మరియూ కాళీయమర్దనం వంటి బాల్య లీలలతో ప్రసిద్ధుడు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి సారథిగా వ్యవహరించి భగవద్గీతను బోధించి జగద్గురువు అయ్యాడు. భారతీయ పరంపరలో గురువుకు ప్రముఖమైన స్థానమున్నది. గురువుకు ఎన్ని నిర్వచనాలున్నా గురువును వర్ణించేందుకు ఎన్ని శ్లోకాలున్నా జగత్తుకు గురువు జగదీశ్వరుడే. కేవలం హిందూ ధర్మంలోనే ఈశ్వరుడికి జగద్గురువు స్థానం లభించింది. ' ఈశావస్యమిదశీ సర్వం' అంటాం. అయితే భాగవతం జగద్గురువును సాక్షాత్కరింపచేసింది. అందుకే కృష్ణం వందే జగద్గురుం అంటాం. శ్రీకృష్ణుడికి తెలియని శాస్త్రం లేదు. 5 వేల క్రితం అర్జునికి చేసిన గీతోపదేశంలో వ్యక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణానికి సంబంధించిన ప్రబోధముంది. పనిమంతులను, నీతిమంతులను తయారు చేసేందుకు ఆయన మాటలెంతో ఉపకరిస్తాయి. సాందీపని ఆశ్రమంలో ఆయన ఒక చక్కటి శిష్యుడనిపించుకున్నాడు. 64 రోజులలో 64 కళలను అభ్యసించాడు. అకాల మరణం పొందిన సాందీపని మహర్షి కొడుకుని యముని గెలిచి సాధించుకొచ్చి గురుదక్షిణగా సమర్పించాడు. సత్యవతి, పరాశరుల కుమారుడు వ్యాసుడు శ్రీ కృష్ణ ప్రేరీతుడై భారత భాగవతాది గ్రంథాలు వ్రాశాడు. భాగవతం మనిషిలో భక్తిని కలిగిస్తుంది. భగవంతునిలో మానసిక సంబంధం ఏర్పరుస్తుంది. సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించే వ్యక్తిత్వ వికాసం భాగవతం కలిగిస్తుంది. భాగవతం ఒక సామాజిక సాంస్కృతిక శాస్త్రం, స్వాయంభువ మనువు నుండి కలియుగం వరకు వరకు ఒక క్రమ వద్ధతిలో కథనం ఉంటుంది. ' సర్వం కృష్ణమయం జగత్ ' అనే భావన కలిగిస్తుంది. శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలు భారతదేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని శ్రీకృష్ణుని బోధనలు సకల మానవాళికి స్ఫూర్తి దాయకమని రాజమహేంద్రవరం సీనియర్ అడ్వకేట్ లా కళాశాల అధ్యాపకులు పాలకొల్లు శ్రీనివాసరావు, రాష్ట్రపతి అబ్దుల్ కలాం అవార్డ్ గ్రహీత 'ఇస్రో ' సీనియర్ సైంటిస్ట్ రిటైర్డ్ ఉక్కళం నరసింహం, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ రిటైర్డ్ ఉక్కళం అనంత కృష్ణ, నిజాంపేట్ శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయం ప్రధాన అర్చకులు అకలంకం బదరీ నారాయణాచార్యులు పేర్కొన్నారు.



## నేడు ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్
# నూతన భవనం ప్రారంభోత్సవం



బంటుమిల్లి శ్రీ వార్త న్యూస్: కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ లక్ష్మీపురం బ్యాంక్ చైర్మన్ యాళ్ల శ్యాంబాబు, తదితరులు పాల్గొని నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు మరియు ప్రింట్ ఒ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము.

## బంటుమిల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి




బంటుమిల్లి శ్రీ వార్త న్యూస్ : బంటుమిల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. మండల సర్వసభ్య సమావేశం బంటుమిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ వెలివెల చిన్నబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు సాగునీరు సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని త్రాగునీరు కూడా సరిగా ఇవ్వలేకపోయారని అధికారులను పలువురు నిలదీశారు. బంటుమిల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ కోరారు. కరువు మండలంగా సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివిధ శాఖల అధికారులు మరియు ఎంపీటీసీలు, సర్పంచులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రక్త నిల్వలు, రక్తదాన శిబిరాల
## నిర్వహణను మరింత బలోపేతం చేయాలి

హెచ్ఐవీ నివారణలో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి....జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ జిల్లాలో రక్త నిల్వలు, రక్తదాన శిబిరాల నిర్వహణను మరింత బలోపేతం చేసి, అవసరమైన వారికి సకాలంలో రక్తం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి నివారణకు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ--ఎయిడ్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల పనితీరు, 10 కీలక పనితీరు సూచికలు (కే పి ఐ), రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్త నిల్వలు, హెచ్ఐవీ వ్యాప్తి నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొత్తం 11 బ్లడ్ బ్యాంకులు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో గుడివాడలో మూడు, మచిలీపట్నంలో నాలుగు ఉండగా, మిగిలినవి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు వివరించారు. రక్తదాన శిబిరాలు తక్కువగా నిర్వహిస్తున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ శిబిరాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం, రెడ్‌క్రాస్ సంస్థల సమన్వయంతో మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్త నిల్వలను అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రియల్‌టైమ్ ఈ--రక్తకోష్ పోర్టల్‌లో రక్త నిల్వలు, ఇతర వివరాల అప్‌డేట్‌లో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే సరిచేయాలని కలెక్టర్ సూచించారు. రక్త నిల్వలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రక్తదాతకు సంబంధించిన ఆభా (ఆధార్) ఐడీని ఈ--రక్తకోష్ పోర్టల్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రక్తదాతల వివరాలను సక్రమంగా నమోదు చేసి, డిజిటల్ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాల సాధనపై సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి అవసరమైన చికిత్స, సేవలు నిరంతరం అందేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ లెప్రసీ, హెచ్ఐవీ, టీబీ అధికారి డాక్టర్ ఎ. వెంకట్రావు, డిస్ట్రిక్ట్ మెడికల్ అధికారి డాక్టర్ వేణుగోపాల్ రావు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్ పండిత్, క్లినికల్ సూపర్‌వైజర్ సాక్షి గోపాల్ రావు, వివిధ బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

